





# ఇక కార్..గో

## జూలై 1 నుంచి విజయవాడ ఎయిర్‌పోర్టులో కార్గో సేవలు

- కాంట్రాక్టు దక్కించుకున్న ఒమేగా ఎంటర్‌ప్రైజెస్
- రైతులు, వర్తక, వ్యాపార, పారిశ్రామిక వర్గాలకు వరం
- విమానయాన సంస్థలు, విమానాశ్రయానికి ఆదాయం
- పాత టెర్మినల్ భవనాన్ని విస్తరించాల్సిన అవసరం

**(ఆంధ్రజ్యోతి, విజయవాడ) :** కొద్దిరోజుల్లో విజయవాడ అంతర్జాతీయ విమానాశ్రయం నుంచి కార్గో సేవలు ప్రారంభంకానున్నాయి. కార్గో సేవలందించే టెండర్లు ఖరారయ్యాయి. ఒమేగా ఎంటర్‌ప్రైజెస్ సంస్థ ఈ కాంట్రాక్టును దక్కించుకుంది. డైరెక్టర్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డీజీసీఏ), ఎయిర్‌పోర్టు అథారిటీ ఆఫ్ ఇండియా (ఏఏఐ) అనుమతులు కూడా పొందింది. దీంతో జూలై 1 నుంచి కార్గో సేవలు ప్రారంభం కానున్నాయి.

### కరోనా తర్వాత ఇన్నాళ్లకు..

2017 మధ్య కాలంలో విజయవాడ విమానాశ్రయంలో కార్గో సేవలు ప్రారంభమయ్యాయి. అప్పట్లో శ్రీప లాజిస్టిక్స్ అనే సంస్థ టెండర్లను దక్కించుకుంది. 2020-కరోనా సమయంలో ఈ సేవలు నిలిచిపోయాయి. కేవలం ఇన్‌కమింగ్ తప్ప, అవుట్‌గోయింగ్‌కు అవకాశం లేకుండాపోయింది. కరోనా పరిస్థితులు చక్కబడినా అవసరమైన అనుమతులను శ్రీప లాజిస్టిక్స్ సాధించలేదు. దీంతో కార్గో సేవలు ఆగిపోయాయి. ఇన్నాళ్లకు మళ్లీ కార్గో సేవలు మొదలవుతున్నాయి. రైతులు, వర్తకులు, వ్యాపార వర్గాల నుంచి పదేపదే ప్రతిపాదనలు వస్తుండటంతో ఎయిర్‌పోర్టు అధికారులు ఏఏఐ ఉన్నతాధికారుల దృష్టికి తీసుకెళ్లారు. విజయవాడ విమానాశ్రయం నుంచి ప్రస్తుతం 24 విమానాలు నడుస్తున్నాయి. వీటిలో దాదాపు 50 టన్నుల వరకు సరుకు రవాణా చేసే వీలుంటుంది. స్థానికంగా ఉన్న రైతులు, వ్యాపారులు, వర్తకులకు ఇది ఎంతో ప్రయోజనం. తక్కువ ఖర్చుతో దేశీయంగా సరుకు రవాణా చేసుకునే వెసులుబాటు కలుగుతుంది. ఇప్పటి వరకు రోడ్డు, రైలు మార్గాలపై ఆధారపడిన వారికి ఇది శుభపరిణామమే. మన ప్రాంతంలో ఎక్కువగా కూరగాయలు, ఆహారశుద్ధి ఉత్పత్తులు, చేపలు, రొయ్యల ఎగుమతులు, దిగుమతులు ఎక్కువ. ఈ కార్గో సేవల ద్వారా విమానయాన సంస్థలకు, విమానాశ్రయానికి అదనపు ఆదాయం కూడా సమకూరుతుంది.

### కార్గో టెర్మినల్‌ను విస్తరించాలి

ప్రస్తుతం ఉన్న కార్గో టెర్మినల్ ఎప్పుడో పాత అవసరాల కోసం నిర్మించింది. ఈ టెర్మినల్ ప్రస్తుత అవసరాలకు సరిపోదు. విస్తరించాల్సిన అవసరం ఉంది. లేదంటే శాశ్వత ప్రాతిపదికన భవన నిర్మాణం చేపట్టాలి. ఇటీవల కేంద్ర పౌరవిమానయాన శాఖ మంత్రి కింజరపు రామ్మోహన్‌నాయుడు ఇక్కడకు వచ్చిన సందర్భంలో విజయవాడ ఎయిర్‌పోర్టు అభివృద్ధికి భరోసానిచ్చారు. కార్గో టెర్మినల్ విస్తరణ అవసరాన్ని విమానాశ్రయ డైరెక్టర్ ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి ఆయన దృష్టికి తీసుకెళ్లారు. మంత్రి కూడా సానుకూలంగా స్పందించడంతో టెర్మినల్ భవన విస్తరణకు మార్గం ఏర్పడింది.

### 1 నుంచి కార్గో సేవలు

జూలై 1 నుంచి కార్గో సేవలు ప్రారంభించటం ఆనందంగా ఉంది. విజయవాడ ఎయిర్‌పోర్టు నుంచి కార్గోకు ఎంతో డిమాండ్ ఉంది. వ్యాపార వర్గాల నుంచి అనేక విజ్ఞాపనలు వచ్చాయి. దీనిని ఏఏఐ దృష్టికి తీసుకెళ్లాం. ఇప్పటికి అవకాశం వచ్చింది. మన రాష్ట్రానికి చెందినవారే కేంద్ర పౌర విమానయాన శాఖ మంత్రి కావటం శుభపరిణామం. కార్గో టెర్మినల్ అంశాన్ని మంత్రి దృష్టికి తీసుకెళ్లాం.

– ఎం.లక్ష్మీకాంత్‌రెడ్డి, ఎయిర్‌పోర్టు డైరెక్టర్



## విద్య, వైద్యరంగాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు

- పాగోలు మోడల్ స్కూల్ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు
- కుప్పంలో మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్‌లో శిక్షణ
- మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి

6లో..



## టీడీపీ మహిళానేతకు అంతిమ వీడ్కోలు

- భారీగా హాజరైన అభిమానులు, నేతలు

# రూ.30 వేలిస్తే పింఛన్

వైసీపీ పాలనలో అక్రమాలు ఒక్కొక్కటి వెలుగులోకి వస్తున్నాయి. ఆ పార్టీ నేతలు దివ్యాంగుల పింఛన్ ఇప్పిస్తామంటూ వేలకు వేలు వసూలు చేసి సదరం సర్టిఫికెట్లు పంపిణీ చేసినట్టు తాజాగా వెలుగులోకి వచ్చింది. నాలుగేళ్లుగా ఈ అక్రమం సాగుతున్నట్టు తెలిసింది. అధికారం కోల్పోయినా ఇంకా మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో దివ్యాంగుల పేరుతో అన్నీ అవయవాలు సక్రమంగా ఉన్నవారికి, పనిచేసే వారికి వైకల్యంతో బాధపడుతున్నట్టు సర్టిఫికెట్లు సృష్టిస్తున్నారు. కూటమి ప్రభుత్వం దివ్యాంగుల పింఛను రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పెంచడంతో సర్టిఫికెట్ రేటు రెట్టింపు చేసి గుట్టుచప్పుడు కాకుండా బేరాలు కుదుర్చుకుంటున్నట్టు వెలుగులోకొచ్చింది.



సర్వజన ఆసుపత్రి

## దివ్యాంగుల పేరుతో సదరం సర్టిఫికెట్ల పంపిణీ

- నాలుగేళ్లుగా వైసీపీ నేతల అక్రమం
- కూటమి ప్రభుత్వంలో పింఛను పెరగడంతో రేటు రెట్టింపు చేసి బేరం

**ఆంధ్రజ్యోతి-మచిలీపట్నం :** వైసీపీ నాయకులు పట్టణ, గ్రామీణ ప్రాంతాల్లో ముఠాగా ఏర్పడిన నాలుగేళ్లగా దివ్యాంగులకు పింఛన్లు ఇప్పిస్తామని ఆశచూపుతూ వారి నుంచి లక్షలాది రూపాయలు వసూలు చేశారు. తమకు రూ.15 వేల నుంచి రూ.20 వేలు ఇస్తే బతికి ఉన్నంతకాలం దివ్యాంగుల పింఛను వస్తుందని మాయమాటలు చెప్పి వసూళ్లకు పాల్పడ్డారు. సదరం క్యాంపునకు వెళ్లేందుకు గ్రామ, వార్డు సచివాలయాల్లో స్లాట్ తామే బుక్ చేస్తామని, సర్టిఫికెట్ మీ చేతుల్లో పెడతామని, పింఛను ఇప్పిస్తామని, తాము చెప్పిన తేదీన ఆసుపత్రికి ఒక్కసారి వస్తే చాలని చెబుతూ మభ్యపెట్టేవారు. ప్రతి సోమ, గురువారాల్లో మచిలీపట్నం సర్వజన ఆసుపత్రిలో జరిగే సదరం క్యాంపునకు వస్తేచాలని, దివ్యాంగుల పింఛను వస్తుందని చెప్పి తమకు నగదు చెల్లించినవారిని ఆసుపత్రికి తీసుకువెళ్లి సర్టిఫికెట్లు ఇప్పించారు. ఆసుపత్రిలోని వైద్యులతో, సదరం క్యాంపులలో పనిచేసే సిబ్బందితో మాట్లాడుకుని ఈ ముఠా సభ్యులు తెరవెనుక చక్రం తిప్పుతున్నారు. నూతన ప్రభుత్వం దివ్యాంగులకు నెలకు రూ.3 వేల నుంచి రూ.6 వేలకు పింఛను పెంచడంతో ఈ ముఠా సదరం క్యాంపుల ద్వారా సర్టిఫికెట్‌లు ఇప్పించేందుకు రేటును పెంచారు. ఒక్కొక్కరి నుంచి రూ.30 వేల నగదు వసూలు చేస్తూ తమ అక్రమాలను మూడు పువ్వులు ఆరు కాయల మాదిరిగా విస్తరిస్తున్నారు.

### చెవిటి లక్షణాలున్నట్టు అధికంగా సర్టిఫికెట్లు

జిల్లాలో 34,355 మందికి దివ్యాంగుల పింఛన్లు ఉన్నాయి. వీరికి జూలై నుంచి నెలకు రూ.6వేలు పింఛనుగా అందిస్తారు. ఇందులో 2020, 21, 22, 23 సంవత్సరాల్లో వైసీపీ నాయకులు అక్రమమార్గంలో ఇప్పించిన పింఛన్లు అధికంగా ఉన్నట్టు సమాచారం. కాళ్లు, చేతులు పనిచేయకపోతే వారి వైకల్యాన్ని కొంతమేర ఇట్టే గుర్తించవచ్చు. వైసీపీ నాయకులు దివ్యాంగుల పింఛను కోసం చెవుడు లక్షణాలతో బాధపడుతున్నట్టు అధికశాతం మందికి సర్టిఫికెట్లు ఇప్పించడం గమనార్హం.



సర్వజన ఆసుపత్రిలో సదరం క్యాంపు కార్యాలయం

### ఒక్కొక్కరిని నుంచి రూ.30 వేలు వసూలు

మోపిదేవి మండలం పెదకళ్లేపల్లి, కొక్కిలిగడ్డ, కే-కొత్తపాలెం, పెదప్రోలు గ్రామాలను ఎంచుకున్న ఇద్దరు స్థానిక వైసీపీ నాయకులు దివ్యాంగుల పింఛన్లు ఇప్పిస్తామని చెప్పి నాలుగేళ్లుగా పెద్దఎత్తున అక్రమాలకు పాల్పడ్డారు. గతంలో ఒక్కొక్కరి నుంచి రూ.15 వేల చొప్పున నగదు వసూలు చేసిన వీరు పింఛనుకు అర్హత పొందేలా సదరం క్యాంపులో మచిలీపట్నం సర్వజన ఆసుపత్రి వైద్యులతో సర్టిఫికెట్‌లో వైకల్యాన్ని నమోదు చేయించారు. నూతన ప్రభుత్వం దివ్యాంగుల పింఛను రూ.6 వేలకు పెంచిందని, గతంలో మాదిరిగా కాకుండా రూ.15 వేలు కాదని, రూ.30 వేల చొప్పున ఇవ్వాలని ఇటీవల వసూలు చేశారు. ఈనెల 27వ తేదీ గురువారం ఈ నాలుగు గ్రామాల నుంచి 30 మందిని సర్వజన ఆసుపత్రిలో జరిగిన సదరం క్యాంపునకు తీసుకురావడంతో అసలు విషయం బయటకు వచ్చింది.

### ఇవిగో అక్రమాలు

- మోపిదేవి మండలంలో మాదిరిగానే మచిలీపట్నం మండలంలో తుమ్మలచెరువు గ్రామంలో ఈ నాలుగేళ్లలో 130 మందికి సదరం క్యాంపు ద్వారా స్థానిక వైసీపీ నాయకుడు దివ్యాంగుల పింఛనుకు సర్టిఫికెట్లు ఇప్పించాడు.
- తుమ్మలపాలెంలో 300 మంది జనాభా ఉంటే 100 మందికిపైగా దివ్యాంగుల పింఛను వస్తోంది. వీరిలో అధిక శాతం మందికి అసలు వినపడదని సదరం క్యాంపు ద్వారా సర్టిఫికెట్ ఇప్పించారు.
- గతంలో ఆధార్ కార్డుల్లో వయసును పెంచి పింఛను ఇప్పిస్తానని ప్రజలను మభ్యపెట్టి పెద్దఎత్తున నగదు వసూలు చేసిన ఇదే వ్యక్తి రెండు, మూడేళ్లుగా సదరం క్యాంపుల్లో దివ్యాంగుల పేరుతో పింఛన్లు ఇప్పిస్తామని చెప్పి ఒక్కొక్కరి నుంచి రూ.20వేల వరకు వసూలు చేశారని రెండు గ్రామాల ప్రజలు బాహాటంగానే చెప్పుకుంటున్నారు.
- జిల్లా సర్వజన ఆసుపత్రిలోని వైద్యులతో తెరవెనుక బేరాలు కుదుర్చుకుని ఈ తతంగం నడుపుతున్నారనే విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. సదరం క్యాంపుల్లో దివ్యాంగుల పేరుతో నకిలీ సర్టిఫికెట్ల జారీపై పూర్తిస్థాయిలో విచారణ చేసి ఈ దందాకు అడ్డుకట్ట వేయాలని పలువురు కోరుతున్నారు.

## ఉ.11.30 నుంచి మ.1.30 సమయంలో దుర్గమ్మ దర్శనాలకు రావొద్దు

6లో


వీఐపీలు, వృద్ధులు, దివ్యాంగులు, అన్ని శాఖల అధికారులకు ఈవో కేఎస్ రామారావు విజ్ఞప్తి.. భక్తులకు మెరుగైన సేవలే లక్ష్యం

అజిత్‌సింగ్‌నగర్‌లోని మదర్సాలో విద్యార్థిని మృతి వెనుక అసలు కారణమేంటి? నిజంగానే ఇక్కడ ఫుడ్ పాయిజన్ అయ్యిందా? జరిగిన ఘటన ఒకటైతే, మదర్సా నిర్వాహకులు ఫుడ్ పాయిజన్ అంశాన్ని తెరపైకి తెచ్చారా? ఫుడ్ పాయిజన్ అయిన మిగతా విద్యార్థినులను ఆసుపత్రిలో చేర్పించకుండా ఎందుకు తీసుకెళ్లిపోయారు? ఈ మదర్సాలో ఉంటున్న గుడివాడకు చెందిన కరిష్మా మృతి వెనుక ఇలాంటి ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయి. నిర్వాహకులే ఏదో చేశారని కరిష్మా తల్లిదండ్రులు ఆరోపిస్తున్నారు.

# మదర్సాలో మిస్టరీ..!

## సింగ్‌నగర్ మదర్సాలో విద్యార్థిని మృతి వెనుక అనుమానాలు

- విద్యార్థినులకు ఫుడ్ పాయిజన్ అంటున్న నిర్వాహకులు
- ఆసుపత్రిలో చేర్పించకుండా హడావిడిగా వెనక్కి..
- ఫుడ్ పాయిజన్ కాదని తేల్చేసిన అధికారులు
- మదర్సాలోని ఫ్రిజ్‌లో 100 కేజీల కుళ్లిన మాంసం
- నిర్వాహకులే ఏదో చేశారంటున్న మృతురాలి బంధువులు
- పోస్టుమార్టం నివేదికలో బయటపడనున్న నిజాలు



**(ఆంధ్రజ్యోతి-విజయవాడ) :** నిస్వాన్ ఎడ్యుకేషనల్ అండ్ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో సయ్యద్ షాహిద్ పర్వీజ్ అనే వ్యక్తి అజిత్‌సింగ్‌నగర్‌లో మదర్సాను నిర్వహిస్తున్నాడు. ఇక్కడ మొత్తం 60 మంది విద్యార్థినులు ఉండగా, ఎనిమిది మందికి ఫుడ్ పాయిజన్ అయిందని నిర్వాహకులు చెబుతున్నారు. వారిలో కరిష్మాను శుక్రవారం ఉదయం నగరంలోని ప్రభుత్వాసుపత్రికి తరలించేసరికి ప్రాణాలు కోల్పోయింది.

### నిర్వాహకుల మాటొకటి.. అధికారుల మాటొకటి

ఎనిమిది మంది బాలికలకు గురువారం రాత్రి ఫుడ్ పాయిజన్ అయిందని నిర్వాహకులు చెబుతున్నారు. కానీ, మదర్సాను పరిశీలించి, ఆసుపత్రిలో బాలికలను పరామర్శించిన అధికారులు మాత్రం అటువంటి దాఖలాలు లేవంటున్నారు. ఎనిమిది మందికి ఫుడ్ పాయిజన్ అయితే, మిగిలిన ఏడుగురిని నిర్వాహకులు ఆసుపత్రిలో చేర్పించలేదు. పరిశీలనలో ఉంచాలని అధికారులు చెప్పినా ప్రభుత్వా సుపత్రిలో ఓపీ చీటీ

- మిగతా 6లో

### నా బిడ్డను ఏదో చేశారు : మస్తాన్ బీ, కరిష్మా తల్లి

'కరిష్మాను ఏడాది క్రితం మదర్సాలో చేర్పించాను. రంజాన్ పండుగకు ఇంటికొచ్చింది. పండుగ అయ్యాక తిరిగి మదర్సాలో అప్పగించాం. కరిష్మాను చూద్దామని కొద్దిరోజుల క్రితం వచ్చాను. ఇంటి నుంచి తీసుకొచ్చి ఇంకా నెల పూర్తికాలేదని చూపించలేదు. ఆమెకు ఇద్దామని కొత్త దుస్తులు కుట్టించాం. మా కుమార్తెకు ఇప్పటి వరకు ఎప్పుడూ జ్వరం కూడా రాలేదు. పూర్తి ఆరోగ్యంగా ఉంటుంది. ఉదయం ఫోన్‌చేసి కరిష్మాకు ఆరోగ్యం బాగోలేదని చెప్పారు. మేము వచ్చేసరికి చనిపోయింది. మదర్సాలో ఏదో జరిగింది. అసలు అక్కడ ఏం జరిగిందో తెలియాలి.'



# వైసీపీతో అంటకాగి...



వీసీ జ్ఞానమణి



కృష్ణా యూనివర్సిటీ

గత ప్రభుత్వంలో వైసీపీ నేతలు చెప్పినట్టు తలాడించిన అధికారులకు ముచ్చెమటలు పడుతున్నాయి. అక్రమాలకు సహకరించిన అధికారులకు కష్టాలు తప్పడం లేదు. విద్యావంతులను తయారు చేసే యూనివర్సిటీకీ ఈ దుస్థితి తప్పలేదు. కృష్ణా యూనివర్సిటీలో పాలనను గాడి తప్పించి.. విద్యార్థుల భవిష్యత్తుతో ఆటలాడి, వైసీపీ నేతలు చెప్పినవారిని అందలం ఎక్కించడంలో కీలకపాత్ర పోషించిన వీసీ జ్ఞానమణి చివరికి బాధ్యతల నుంచి తప్పుకోవాల్సి వచ్చింది. విమర్శలపాలై వీసీ బాధ్యతలకు శుక్రవారం ఆయన రాజీనామా చేయడం వర్సిటీలో హాట్‌టాపిక్‌గా మారింది.

## కృష్ణా యూనివర్సిటీ వీసీ అడ్డగోలు పాలన

- ఎంబీఏ నాలుగో సెమిస్టర్ ఫలితాలు ఇవ్వకపోవడంపై గవర్నర్‌కు విద్యార్థుల ఫిర్యాదు
- అనర్హులకు పదవుల్లో ప్రాధాన్యత
- ప్రొఫెసర్లు రెండు వర్గాలుగా చీలినా పట్టించుకోని వైనం
- వర్సిటీలో గాడి తప్పిన పాలన
- విమర్శలతో వీసీ జ్ఞానమణి రాజీనామా

**మచిలీపట్నం, జూన్ 28 (ఆంధ్రజ్యోతి) :** కృష్ణా యూనివర్సిటీ వీసీగా గతేడాది జూలై13వ తేదీన జ్ఞానమణి బాధ్యతలు చేపట్టారు. ఏడాది గడవకముందే ఆయన వీసీ పదవి నుంచి తప్పుకున్నారు. ఏడాదికాలంగా వైసీపీ నాయకులు చెప్పినట్టుగానే నడుచుకుని యూనివర్సిటీలో పరిపాలనాపరమైన అంశాల్లో ఆయన నిర్ణయాలు తీసుకున్నారనే ఆరోపణలు ఎదుర్కొన్నారు.

### గవర్నర్‌కు విద్యార్థుల ఫిర్యాదు

క్యాంపస్ కళాశాలలో ఎంబీఏ నాలుగో సెమిస్టర్ ఫలితాలు వెల్లడించకపోవడం, యూనివర్సిటీ పరిధిలోని మిగిలిన కళాశాలల్లో ఎంబీఏ ఫలితాలను వెల్లడించడంతో ఈ అంశం వివాదాస్పదమైంది. ఎంబీఏ నాలుగో సెమిస్టర్ రీవాల్యుయేషన్‌కు దరఖాస్తు చేసుకునే గడువు ఈనెల 18, 19 తేదీలతో పూర్తయినా క్యాంపస్ కళాశాలలో ఎంబీఏ ఫలితాలను మాత్రం వెల్లడించలేదు. దీంతో క్యాంపస్ కళాశాలలో ఎంబీఏ విద్యార్థులు గవర్నర్ కార్యాలయానికి ఫిర్యాదు చేశారు.

### అనర్హులను అందలమెక్కించి..

యూనివర్సిటీలోని రీసెర్చ్ విభాగంలో జరిగిన అక్రమాలు, యూనివర్సిటీ పరిధిలోని కళాశాలలకు అఫిలియేషన్ ఇచ్చేందుకు పరిశీలకుడిగా అర్హతలేని అధ్యాపకుడికి బాధ్యతలు అప్పగించారనే అంశంపైనా ఆయనపై విమర్శలున్నాయి. పీహెచ్‌డీల ప్రధానంలో చోటుచేసుకున్న జాప్యం, అక్రమాలను నివారించడంలోనూ ఆయన పట్టించుకోకపోవడం తీవ్ర చర్చనీయాంశమైంది. వైసీపీ ప్రభుత్వం హయాంలో ఆ పార్టీ పెద్దల సూచనలతో కొందరు ప్రొఫెసర్లను వారి బాధ్యతల నుంచి తప్పించి, అర్హతలేని వారికి వివిధ విభాగాల్లో బాధ్యతలను అప్పగించడంపైనా వర్సిటీలో పెద్ద చర్చ నడిచింది.

### రెండు వర్గాలు ప్రొఫెసర్లు

నూజివీడు పీజీ సెంటరులో పనిచేస్తున్న ఒక ప్రొఫెసర్ యూనివర్సిటీలో

- మిగతా 6లో

## గత కమిషనర్‌కు 6 నెలల జైలు శిక్ష

**మచిలీపట్నం టౌన్, జూన్ 28 :** హైకోర్టు ఉత్తర్వులు ఖాతరు చేయకుండా మునిసిపల్ రెవెన్యూ అధికారి వెంకటేష్‌ను విధుల్లోకి తీసుకోనందుకు అప్పటి మచిలీపట్నం మునిసిపాలిటీలో కమిషనర్‌గా పనిచేసిన చంద్రయ్యకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధిస్తూ హైకోర్టు జడ్జి నిమ్మగడ్డ వెంకటేశ్వరరావు శుక్రవారం తీర్పు చెప్పారు. 2022 ఏప్రిల్ నుంచి 2024 మార్చి వరకు చంద్రయ్య మునిసిపల్ కమిషనర్‌గా పనిచేశారు. ఈ కాలంలో మునిసిపల్ రెవెన్యూ ఆఫీసర్ ఎస్.వెంకటేష్‌ను విధుల్లోకి తీసుకోవాలని హైకోర్టు ఉత్తర్వులు జారీ చేసింది. 2022 మార్చి 1 నుంచి 2023 సెప్టెంబరు వరకు వెంకటేష్ వెయిటింగ్ పీరియడ్‌లో ఉన్నారు. ఆ తరువాత హైకోర్టుకు వెళ్లగా వెంకటేష్‌ను విధుల్లోకి తీసుకోవాలని తీర్పు ఇచ్చారు. ఈ తీర్పు మేరకు మునిసిపల్ డైరెక్టర్ విధుల్లోకి చేర్చుకోవాలని చంద్రయ్యకు ఉత్తర్వులు జారీ చేశారు. అయినప్పటికీ అప్పటి పాలకుల మాట విని వెంకటేష్‌ను విధుల్లోకి తీసుకోలేదు. ఆ తరువాత 2024 జూన్ 6న కొత్తగా వచ్చిన కమిషనర్ బాపిరాజు వెంకటేష్‌ను విధుల్లోకి తీసుకున్నారు. ఈ నేపథ్యంలో తనను విధుల్లోకి తీసుకోకుండా ఇబ్బంది పెట్టారని వెంకటేష్ కోర్టును ఆశ్రయించడంతో చంద్రయ్యకు ఆరు నెలల జైలు శిక్ష, రూ.2వేల జరిమానా విధించారు. చంద్రయ్య ప్రస్తుతం ఏలూరు నగరపాలక సంస్థ అసిస్టెంట్ కమిషనర్‌గా పనిచేస్తున్నారు. చంద్రయ్యకు జైలుశిక్ష విధించిన తీర్పు నగరంలో, మునిసిపల్ కార్యాలయంలో సంచలనం రేకెత్తించింది.



చంద్రయ్య



### ఉ.11.30 నుంచి మ.1.30 సమయంలో

# దుర్గమ్మ దర్శనాలకు రావొద్దు

- వీఐపీలు, వృద్ధులు, దివ్యాంగులు, అన్ని శాఖల అధికారులకు ఈవో కేఎస్ రామారావు విజ్ఞప్తి..

**వన్‌టౌన్, జూన్ 28 :** దుర్గామల్లేశ్వరస్వామివార్ల దేవస్థానంలో అమ్మవారికి ప్రతి రోజు ఉదయం 11.45 నుంచి మధ్యాహ్నం 12.15 మధ్య మహా నైవేద్య కార్యక్రమం జరుగుతున్నందున దర్శనాలు నిలిపివేస్తున్నామని ఈవో కేఎస్ రామారావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. దీంతో పాటుగా దేవస్థానంలో అభివృద్ధి పనులు జరుగుతున్నాయని శుక్ర, శని, ఆదివారాలతో పాటు ఇతర రోజుల్లో కూడా భక్తుల రద్దీ పెరుగుతున్నందున భక్తులకు మెరుగైన సేవలందించేందుకు వీఐపీలు, వృద్ధులు, దివ్యాంగులు, అన్ని శాఖల అధికారులు ఉదయం 11.30 మధ్యాహ్నం 1.30 గంటల లోపు కాకుండా ఇతర సమయాలలో దర్శనానికి రావాలని విజ్ఞప్తి చేశారు. శుక్ర, శని, ఆదివారాలలో ఇతర ప్రత్యేక రోజులలో రద్దీ విపరీతంగా ఉండటం వలన కొండపైకి వాహనాల రాకపోకలను రద్దు చేసామని పున్నమిఘాట్, సీతమ్మవారి పాదాల వద్ద పార్కింగ్‌లో వాహనాలను నిలుపుకుని దేవస్థానం బస్సులలో కొండపైకి చేరుకోవాలని విజ్ఞప్తి చేశారు.

**ధర్మపథం వేదికపై..**

దుర్గగుడిలోని ధర్మపథం వేదికపై శుక్రవారం స్వేచ్ఛ నృత్య తరంగిణి గోవర్ధనరావు ఆధ్వర్యంలో కూచిపూడి నాట్యప్రదర్శన హృద్యంగా నిర్వహించారు. పలు కీర్తనలకు కళాకారులు తమ అభినయ కౌశలంతో ఆకట్టుకున్నారు.

## దుర్గమ్మను దర్శించుకున్న రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి



**వన్‌టౌన్, జూన్ 28 :** దుర్గామల్లేశ్వరస్వామి దేవస్థానంలో కనకదుర్గమ్మ దర్శనార్థం శుక్రవారం రాష్ట్ర ఆర్థిక శాఖ ముఖ్య కార్యదర్శి పీయూష్ కుమార్ విచ్చేశారు. ఆయనకు ఈవో కేఎస్ రామారావు, అధికారులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు ఆయనకు వేదాశీర్వచనం చేశారు. ఈవో ఆయనకు అమ్మవారి ప్రసాదం, చిత్రపటం, శేషవస్త్రం అందజేశారు.

### సుబ్బారాయుడి హుండీ కానుకల ఆదాయం

## 90 రోజులకు రూ.84.23 లక్షలు



**మోపిదేవి, జూన్ 28 :** మోపిదేవి సుబ్రహ్మణ్యేశ్వరస్వామికి భక్తులు సమర్పించిన హుండీల కానుకలు రూ.84.23 లక్షలు సమకూరినట్టు ఆలయ కార్యనిర్వహణాధికారి ఎన్.ఎస్.చక్రధరరావు తెలిపారు. శుక్రవారం ఆలయ ప్రాంగణంలో అధికారుల పర్యవేక్షణలో కానుకల లెక్కింపు జరిగింది. 90 రోజుల కాల వ్యవధికి జరిగిన హుండీల లెక్కింపులో నగదు రూపంలో 84,23,387లు, వెండి అరుకేజీల 846 గ్రాములు, బంగారం 64 గ్రాములు, అమెరికన్ డాలర్లు 541 వచ్చినట్టు ఈవో తెలిపారు.

**సుబ్బారాయుడి సేవలో ఐఏఎస్ అధికారి నివాస్**

సుబ్రహ్మణ్యేశ్వరస్వామిని సీనియర్ ఐఏఎస్ అధికారి జె.నివాస్ దంపతులు శుక్రవారం ఉదయం దర్శించుకున్నారు. ఆలయ అధికారులు, అర్చక బృందం వారికి ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. నాగపుట్టలో పాలుపోసి స్వామివారిని దర్శించుకుని విశేష పూజలు చేశారు. అర్చక బృందం వేదమంత్రాలతో ఆశీర్వచనం పలికి శేష వస్త్రాలతో సత్కరించారు.



యలమర్రు గ్రామంలో విజయోత్సవ ర్యాలీలో వర్ల కుమార్ రాజా

## కష్టం ప్రజల గడప చేరకుండా తోడుగా నిలుస్తా

- విజయోత్సవ వేడుకల్లో వర్ల కుమార్ రాజా

**పెదపారుపూడి :** తనకు పట్టం కట్టిన ప్రజలకు అందుబాటులో ఉండి సేవలందిస్తానని పామర్రు ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా అన్నారు. పెదపారుపూడి మండలం గోపువానిపాలెం, మర్రివాడ, యలమర్రు, చిన్నపారుపూడి గ్రామాల్లో శుక్రవారం విజయోత్సవ ర్యాలీ నిర్వహించారు. వర్ల కుమార్ రాజా మాట్లాడుతూ దశాబ్దాలుగా టీడీపీ గెలుపు కష్టం అనుకునే నియోజకవర్గంలో మెజారిటీ ఇచ్చిన ప్రజలకు ఏమిచ్చి రుణం తీర్చుకోగలను అన్నారు. పాదయాత్రలో నియోజకవర్గంలోని సమస్యలన్నీ చూశానని, ప్రజలు ఎదుర్కొంటున్న ఇబ్బందుల్ని తెలుసుకున్నానన్నారు. ఆ సమస్య లన్నీ పరిష్కరించి మోడల్ నియోజకవర్గంగా మార్చి ప్రజల రుణం తీర్చుకుంటానని అన్నారు. కుమార్ రాజా దంపతులు, వర్ల రామయ్య, జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జ్ తాడిశెట్టి నరేష్, మండల టీడీపీ అధ్యక్షుడు చలసాని రమేష్, మండల కార్యదర్శి మనిముక్కు రాంబాబు, జిల్లా టీడీపీ ఉపాధ్యక్షుడు సూరపనేని సత్యనారాయణ, మండల బీసీ సెల్ అధ్యక్షులు వెంకట నారాయణ, మర్రివాడ సర్పంచ్ ఫ్రాన్సిస్, గోపువానిపాలెం సర్పంచ్ భూషయ్య, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

## జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్‌కు ఘనస్వాగతం

**గన్నవరం/వన్‌టౌన్, జూన్ 28:** జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్ రాధాకృష్ణన్‌కు గన్నవరం విమానాశ్రయంలో ఘనస్వాగతం లభించింది. హైదరాబాద్ నుంచి శుక్రవారం ఆయన ఇక్కడికి విచ్చేశారు. తెలంగాణా గుంటూరు ఆర్డీవో శ్రీకర్, పలువురు ఉన్నతాధికారులు స్వాగతం పలికారు. అనంతరం రోడ్డు మార్గాన ఉండవల్లి సీఎం చంద్రబాబు నివాసానికి తరలివెళ్లారు. ఇంద్రకీలాద్రిపై కొలువైన కనకదుర్గమ్మను దర్శించుకునేందుకు విచ్చేసిన రాధాకృష్ణన్‌కు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ సృజన పుష్పగుచ్ఛం అందించి స్వాగతం పలికారు. శుక్రవారం నగరంలో రాధాకృష్ణన్ పర్యటించారు.



జార్ఖండ్, తెలంగాణ రాష్ట్రాల గవర్నర్‌కు స్వాగతం చెబుతున్న కలెక్టర్ సృజన

# విద్య, వైద్యరంగాల్లో ఎన్టీఆర్ ట్రస్ట్ సేవలు

- పాగోలు మోడల్ స్కూల్ విద్యార్థుల ఉత్తమ ఫలితాలు
- కుప్పంలో మహిళలకు స్వయం ఉపాధి కోసం టైలరింగ్‌లో శిక్షణ
- మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి



విద్యార్థినులతో మాట్లాడుతున్న నారా భువనేశ్వరి

**చల్లపల్లి, జూన్ 28 :** ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, స్వయం ఉపాధి రంగాల్లో సేవలు అందిస్తున్నట్టు ఎన్టీఆర్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి తెలిపారు. చల్లపల్లి మండలం పాగోలులోని ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌ను శుక్రవారం భువనేశ్వరి సందర్శించారు. ఈ సందర్భంగా పిల్లలను పలకరించి, తరగతి, హాస్టల్ గదులు, వసతి సౌకర్యాలను అడిగి తెలుసుకున్నారు. భోజనశాలను పరిశీలించి పిల్లలతో కలిసి భోజనం చేశారు. అనంతరం ఆమె మాట్లాడుతూ, 1997లో చంద్రబాబునాయుడు ఎన్టీఆర్ ట్రస్ట్‌ను ప్రారంభించారని తెలిపారు. ప్రతి రక్తపు బొట్టు ఆపదలోని జీవితంలో వెలుగులు నింపుతుందనే ఆలోచనతో బ్లడ్‌బ్యాంక్ ఏర్పాటు చేయటం జరిగిందనీ, ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో గండిపేటలో ట్రస్ట్ హైస్కూల్, మహిళా కళాశాల, చల్లపల్లిలో హైస్కూల్ నిర్వహిస్తున్నట్టు తెలిపారు. గండిపేటలో విద్యాసంస్థ నిర్వహణలో వచ్చే లాభాలను చల్లపల్లి విద్యాసంస్థ నిర్వహణకు వినియోగిస్తామన్నారు. అనాథ పిల్లలు, తల్లిదండ్రులు పోగొట్టుకున్న పిల్లలకు ఇక్కడ చదువుచెప్పటం జరుగుతుందని తెలిపారు. పదవ తరగతి పరీక్షా ఫలితాల్లో భవ్యసాయి రాష్ట్రస్థాయిలో మూడో ర్యాంకు సాధించినట్టు తెలిపారు. ప్రకృతి వైపరీత్యాల సమయంలో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామనీ, ఇక్కడ సేవలందించే వలంటీర్లు ఉండటం సంతోషకరమన్నారు. సంజీవిని క్లినిక్‌ను సాలూరులో ప్రారంభించామని, మెడికల్ సర్వీస్ అందుబాటులో లేని ఏజెన్సీ ప్రాంతాల్లో నిర్వహించదలచినట్టు తెలిపారు. ఇప్పటికే కొన్ని ప్రాంతాల్లో క్లినిక్‌లు ప్రారంభించినట్టు చెప్పారు. మొబైల్ బస్ ద్వారా వైద్యసౌకర్యాలు అందించనున్నట్టు వివరించారు. మహిళల స్వయం ఉపాధికి కుప్పంలో మూడు నెలల టైలరింగ్ శిక్షణ ప్రారంభించినట్టు తెలిపారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ మదుసూధనరావు, హైస్కూల్ ఉపాధ్యాయ బృందం పాల్గొన్నారు.

# అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలి

- డయేరియా మృతులకు రూ.10లక్షల పరిహారం చెల్లించాలి
- గ్రామీణ ప్రాంతాలకు కృష్ణా జలాలు అందించండి
- సీపీఎం నేత సీహెచ్ బాబురావు డిమాండ్



ఆరోగ్యకేంద్రంలో డయేరియా బాధితులను పరామర్శిస్తున్న సీహెచ్ బాబురావు తదితరులు

**జగ్గయ్యపేట, జూన్ 28 :** రాష్ట్రంలో పలు జిల్లాల్లో డయేరియా ప్రబలుతుండటంపై రాష్ట్ర ప్రభుత్వం అఖిలపక్ష సమావేశం ఏర్పాటు చేయాలని సీపీఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యుడు సీహెచ్ బాబురావు డిమాండ్ చేశారు. ఆయన శుక్రవారం జగ్గయ్యపేటలో డయేరియా ప్రభావిత ప్రాంతాల్లో పర్యటించారు. ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించారు. ఈ సందర్భంగా జగ్గయ్యపేట సామాజిక ఆరోగ్యకేంద్రంలో విలేకర్లతో మాట్లాడుతూ, జగ్గయ్యపేట ప్రాంతంలో ఆరుగురు డయేరియాతో మృతి చెందితే అధికారులు సంఖ్య తగ్గించి ప్రభావాన్ని తగ్గించి చూపే ప్రయత్నం చేయటం తగదన్నారు. ప్రభుత్వం డయేరియా మృతులకు కనీసం రూ.10లక్షలు పరిహారం ఇవ్వాలని డిమాండ్ చేశారు. కనీసం ప్రజలకు సురక్షిత మంచినీటిని అందించే పరిస్థితిలో గ్రామ పంచాయతీలు లేవని ఆందోళన వ్యక్తం చేశారు. షేర్‌మహ్మద్‌పేటతో పాటు పలు గ్రామాలకు కృష్ణాజలాలను అందించాలని కోరారు. ఏఐబీ ద్వారా పురపాలకసంఘాల్లో పైపులైన్ల విస్తరణ, మార్పిడికి మంజూరు చేసిన నిధులలో గత ప్రభుత్వం మ్యాచింగ్ గ్రాంట్ ఇవ్వకపోవటంతో పనులు జరగలేదని, ప్రస్తుత ప్రభుత్వం శ్రద్ధ చూపి తిరిగి పనులు చేపట్టాలని కోరారు. జగ్గయ్యపేటలో పైపులైన్ మార్పిడి పనులకు రూ.5కోట్లు ఇవ్వాలని, పంచాయతీలకు రూ.5లక్షలు ఇవ్వాలని, ఆసుపత్రుల్లో సౌకర్యాలు పెంచాలని, మందులు ఎప్పుడు ఉండేలా చూడాలని, సిబ్బందిని ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. ఆయనతో పాటు సీపీఐ నేతలు సుబ్బరావమ్మ, జిల్లా కార్యదర్శి డీవీ కృష్ణ, ఎన్‌సీహెచ్ శ్రీనివాస్, నాగమణి, హనుమంతురావు, కోటకృష్ణ, రాము, రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# జవాబుదారీగా పనిచేయండి

- అధికారులతో కలెక్టర్ బాలాజీ సమీక్ష
- అవరోధాలు అధిగమించాలని ఆదేశం



సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా కలెక్టర్ బాలాజీ

**అవనిగడ్డ, జూన్ 28 :** అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాల అమలులో జవాబుదారీగా వ్యవహరించాలని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ జిల్లా అధికారులకు సూచించారు. అవనిగడ్డలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయ సమావేశ మందిరంలో నిర్వహించిన నియోజకవర్గస్థాయి సమీక్షా సమావేశంలో కలెక్టర్ వివిధ శాఖల ఆధ్వర్యంలో జరుగుతున్న అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్ మాట్లాడుతూ, తీరప్రాంత మండలాలైన కోడూరు, నాగాయలంక ప్రాంతాల్లో నీరు అందించి అక్కడి రైతులు పంట పండించుకునేలా వెసులుబాటు కల్పించాలని సూచించగా, కలెక్టర్ స్పందించి అందుకు ఎదురయ్యే అవరోధాలను తొలగించి ఆ ప్రాంతాలకు సక్రమంగా నీరు అందించేలా చూడాలని ఇరిగేషన్ అధికారులను ఆదేశించారు. నాగాయలంక మండల పరిధిలోని ఎదురుమొండి దీవుల్లో ప్రధాన సమస్యగా ఉన్న నాచుగుంట - ఎదురుమొండి రహదారి సమస్యను కలెక్టర్ దృష్టికి తీసుకెళ్లగా, త్వరలోనే అటవీశాఖాధికారులతో ప్రత్యేకంగా సమావేశం నిర్వహించి అటవీ శాఖ అనుమతుల విషయంలో జరుగుతున్న ఇబ్బందులు తొలగిస్తామని తెలిపారు. కాంట్రాక్టర్లపై ఒత్తిడి తీసుకొచ్చి రహదారి పనులను వెంటనే పూర్తి చేయించాలని కలెక్టర్ ఆదేశించారు. జూలై నెలలో వన మహోత్సవం నిర్వహించి కరకట్టల వెంబడి పెద్ద ఎత్తున మొక్కలు నాటి ప్రతీ మొక్క పెరిగి పెద్దయ్యేలా సంరక్షించే ఏర్పాట్లు కూడా చేయాలని కలెక్టర్ డ్వామా, పంచాయతీరాజ్ అధికారులను ఆదేశించారు. గడిచిన ఐదేళ్లలో ప్రకృతి సహజ వనరుల దోపిడీ ఇష్టారీతిగా సాగిందని, అలాంటి పరిస్థితి పునరావృతం కాకుండా, ఇసుక, బుసక, మట్టి విషయంలో ప్రభుత్వం నిర్దేశించిన చట్టాలను ఖచ్చితంగా అమలు చేయాలని బుద్ధప్రసాద్ అధికారులకు సూచించారు. కార్యక్రమంలో జేసీ గీతాంజలి శర్మ, డీఆర్వో చంద్రశేఖరరావు, ఆర్డీవో శ్రీదేవి, ముఖ్య గణాంక అధికారి గణేష్, నియోజకవర్గ ప్రత్యేక అధికారి తెహెరా సుల్తానా, డీఎం అండ్ హెచ్‌వో గీతాబాయి, వివిధ శాఖల అధికారులు, ఆరు మండలాల ప్రభుత్వ ఉద్యోగులు పాల్గొన్నారు.

**శయన బుద్ధ విహార్ పూర్తి చేద్దాం**

**ఘంటసాల :** శయన బుద్ధ విహార్ నిర్మాణాన్ని పూర్తి చేద్దామని, రివైజ్డ్ ఎస్టిమేషన్స్‌తో రావాలని కలెక్టర్ బాలాజీ అధికారులను ఆదేశించారు. ఘంటసాలలో పర్యాటక శాఖ ఆధ్వర్యంలో చేపట్టిన శయన బుద్ధవిహార్ ప్రాజెక్టు నిర్మాణం నిధుల లేమితో నిలిచిపోయిందన్న విషయాన్ని ఎమ్మెల్యే కలెక్టర్ దృష్టికి తీసుకురాగా, కలెక్టర్ నిర్మాణ ప్రాంతాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా కలెక్టర్‌కు ప్రాజెక్టు రూపకర్త రేగుళ్ల మల్లిఖార్జునరావు శయన బుద్ధవిహార్ ప్రాజెక్టు వివరాలను తెలియజేశారు. రివైజ్డ్ ఎస్టిమేషన్స్‌తో జూలై 9వ తేదీన కార్యాలయానికి రావాలని ఆయన అధికారులను ఆదేశించారు. ఘంటసాలలో ఉన్న బౌద్ధ స్థూపాన్ని కలెక్టర్ పరిశీలించారు.

## వైసీపీతో అంటకాగి..

(5వ పేజీ తరువాయి)

జరుగుతున్న అక్రమాలపై విచారణ చేయాలని కృష్ణా యూనివర్శిటీ ప్రాంగణంలో గత నెలలో శాంతియుతంగా రిలేదీక్ష చేపట్టారు. దానిని భగ్నం చేసి సదరు ప్రొఫెసర్‌ను పోలీస్‌స్టేషన్‌కు తీసుకువెళ్లి మూడు గంటలపాటు అక్కడ ఉండేలా చేయడంతో యూనివర్శిటీలో పనిచేసే అధ్యాపకులు రెండు వర్గాలుగా విడిపోయారు. ఒకవర్గానికి వీసీ అనుకూలంగా ఉండి పరిపాలనా వ్యవహారాల్లో గజిబిజి వాతావరణం సృష్టించారు.

**● భవనాలు నిర్మించకుండా బిల్లులు**

యూనివర్శిటీలో భవనాల నిర్మాణం సక్రమంగా చేయకుండానే బిల్లులు చెల్లించడం, వాటి అంచనాలను పెంచడం, లేదా తగ్గించడంతో యూనివర్శిటీ పరిపాలనా లోపాలతోనూ వీసీ ఇటీవల వార్తల్లో నిలిచారు. ఈ నేపథ్యంలో వీసీ వ్యవహారశైలిపై గవర్నర్ కార్యాలయానికి, ఉన్నత విద్యాశాఖమండలికి పలు ఫిర్యాదులు వెళ్లాయి. వీటన్నిటి నేపథ్యంలో ఇమడలేక వీసీ తన పదవికి రాజీనామా చేశారని అధ్యాపకులు చెప్పుకుంటున్నారు.

**● నూతన వీసీ ఎవరో**

కృష్ణా యూనివర్శిటీ వీసీ జ్ఞానమణి రాజీనామా చేయడంతో నూతన వీసీగా ఎవరిని నియమిస్తారనే అంశంపై ఉత్కంఠ నెలకొంది. యూనివర్శిటీలో పనిచేసే సీనియర్ అధ్యాపకుడిని ఇన్‌చార్జి వీసీగా నియమించి, నాలుగైదు నెలల్లో నూతన వీసీని నియమిస్తారనే ప్రచారం జరుగుతోంది. యూనివర్శిటీలో పనిచేసే అధ్యాపకులు, సిబ్బంది రెండు వర్గాలుగా విడిపోవడంతో పరిపాలన ఇప్పటికే గాడి తప్పింది.

### ఎమర్జెన్సీ, చీకటి రోజులకు కారణమైన కాంగ్రెస్‌కు

## రాజ్యాంగంపై మాట్లాడే హక్కు లేదు

- మంత్రి సత్యకుమార్



సదస్సులో మాట్లాడుతున్న మంత్రి సత్యకుమార్

**మొగల్రాజపురం, జూన్ 28 :** ఎమర్జెన్సీ చీకటి రోజులకు కారణమైన కాంగ్రెస్ రాజ్యాంగం గురించి మాట్లాడటం దారుణమని రాష్ట్ర ఆరోగ్య శాఖ మంత్రి, బీజేపీ జాతీయ కార్యదర్శి సత్యకుమార్ తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో 'నాటి ఎమర్జెన్సీ సమయంలో జరిగిన యదార్థ సంఘటనలు'పై నిర్వహించిన సదస్సుకు ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ, ఎమర్జెన్సీలో సంఘ్ పరివార్‌కు చెందిన లక్షమందిని జైల్లో పెట్టిన కాంగ్రెస్‌కు నేడు ప్రజాస్వామ్యం గురించి మాట్లాడే హక్కు లేదన్నారు. జాతీయ స్థాయిలో అనాడు ఇండియన్ ఎక్స్‌ప్రెస్, ఆర్‌ఎస్‌ఎస్ పత్రిక ఆర్గనైజర్, ఈనాడు ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాడి ప్రజాస్వామ్య విలువలను కాపాడే ప్రయత్నం చేశాయన్నారు. ఎమర్జెన్సీకి వ్యతిరేకంగా పోరాటం చేసిన అంజనేయులు, టీవీ సత్యనారాయణ, సత్యమూర్తి వంటి వారు మనముందు ఉన్నారని చెప్పారు. కొన్ని రాజకీయ పార్టీలు అధికారంలోకి రాగానే కేంద్రంలో నరేంద్రమోదీ రాజ్యాంగాన్ని మార్చుతారని ప్రచారం చేశారని దుయ్యబట్టారు. అంబేద్కర్ రాసిన రాజ్యాంగాన్ని కాపాడేదే ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అని చెప్పారు. కాంగ్రెస్ మోచేతి నీళ్లు తాగే కొందరు కమ్యూనిస్టులు కాలం చెల్లిన సిద్ధాంతాలను పట్టుకుని వేలాడుతున్నారని విమర్శించారు. మన రాష్ట్రంలో గత ఐదు సంవత్సరాలు అప్రకటిత ఎమర్జెన్సీ సాగిందని చెప్పారు. ప్రభుత్వ నిధులు మళ్లింపు నుంచి ప్రశ్నించిన వారిని జైళ్లలో పెట్టడం వరకు ఎమరెన్సీని తలపించగా.. పాలనను గాలికి వదిలేశారని, గాడి తప్పిన రాష్ట్రాన్ని, పాలనను గాడిలో పెట్టే బాధ్యతను ప్రజలు చంద్రబాబుకు అప్పగించారని చెప్పారు. సమయం ఇస్తే చంద్రబాబు ఆంధ్రప్రదేశ్‌కు గత వైభవం తెస్తారని చెప్పారు. కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమి కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ఆర్‌ఎస్‌ఎస్ నాయకులు కోనేరు దుర్గాప్రసాద్, అడ్డూరి శ్రీరాం, తదితరులు ప్రసంగించారు. కార్యక్రమానికి బీజేపీ సీనియర్‌నేత కిలారు దిలీప్ వ్యాఖ్యతగా వ్యవహరించారు.

## భద్రాచలం రోడ్-విజయవాడ రైలు తాత్కాలికంగా రద్దు

**రైల్వేస్టేషన్, జూన్ 28 :** సికింద్రాబాద్ డివిజన్‌లో ట్రాఫిక్ నిర్వహణ కారణంగా 0278, 07979 నెంబరు భద్రాచలం రోడ్-విజయవాడ రైళ్లను జూలై 1 నుంచి 31వ తేదీ వరకు రద్దు చేస్తున్నట్టు విజయవాడ డివిజన్ పీఆర్‌వో నుస్రత్ ఎం మండ్రూప్కర్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు.

మన్మాడ్-దౌండ్ సెక్షన్‌లోని పూణే డివిజన్‌లో కుంటాంబ-కంచాన్‌గావ్ మార్గంలో షిరిడీ సాయినగర్ ఎక్స్‌ప్రెస్‌ను పునరుద్ధరిస్తున్నట్టు విజయవాడ డివిజన్ అధికారులు తెలిపారు. గతంలో ఈ నెల 29, 30వ తేదీలలో షిరిడీ సాయినగర్ ఎక్స్‌ప్రెస్ రైలును రద్దు చేస్తున్నట్టు ప్రకటించారు. అయితే 17206 కాకినాడపోర్టు-షిరిడీ సాయినగర్ ఎక్స్‌ప్రెస్‌ను శనివారం డెస్టినేషన్ వరకు నడుపుతున్నట్టు తెలిపారు. 17205 షిరిడీ సాయినగర్-కాకినాడ పోర్టు ఎక్స్‌ప్రెస్ యథావిధిగా షెడ్యూల్ ప్రకారం నడుస్తుందని ప్రకటించారు.

## ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్ ఫెసిలిటేటర్లకు జీతాలు ఉండవు

**రైల్వేస్టేషన్, జూన్ 28 :** ఆటోమేటిక్ టికెట్ వెండింగ్ మెషీన్ (ఏటీవీఎం)ల ఫెసిలిటేటర్లకు ఎటువంటి జీతభత్యాలు, ఉద్యోగ ప్రయోజనాలు ఉండవని విజయవాడ రైల్వే డివిజన్ అధికారులు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఇది శాశ్వత, తాత్కాలిక ఉద్యోగం కూడా కాదని స్పష్టం చేశారు. ఈ మేరకు పీఆర్‌వో ఒక ప్రకటన చేస్తూ ఈ నెల 10వ తేదీన ఏటీవీఎంలలో ఫెసిలిటేటర్లను ఏర్పాటు చేయడం కోసం నోటిఫికేషన్ జారీ చేసినట్టు తెలిపారు. ప్రయాణికులకు సులభమార్గంలో ఏటీవీఎంల ద్వారా టికెట్ల జారీ కోసం ఈ సౌకర్యం ఏర్పాటు చేయబడిందని, వీటిని నిర్వహించే వారికి ఎటువంటి వేతనాలు, ఉద్యోగ ప్రయోజనాలు కానీ ఉండవని తెలిపారు. అయితే కొంతమంది తప్పుడు సమాచారాన్ని ప్రచారం చేస్తున్నట్టుగా తమ దృష్టికి వచ్చిందని తెలిపారు. నిబంధనల ప్రకారం ఏటీవీఎం ఫెసిలిటేటర్లకు టికెట్లు విక్రయించగా వచ్చిన డబ్బుపై బోనస్‌ను మాత్రమే తీసుకోవడానికి అర్హత ఉంటుందని, ఎటువంటి ప్రకటనలను నమ్మవద్దని తెలిపారు. దీనిపై ఎవరికైనా సందేహాలున్నట్టయితే సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కార్యాలయంలో సంప్రదించాలని చెప్పారు. ఏటీవీఎం ఫెసిలిటేటర్లకు సంబంధించిన దరఖాస్తులను వెబ్‌సైట్‌లో నుంచి పొందవచ్చునని తెలిపారు.



అంతిమయాత్రలో పాల్గొన్న నేతలు

### టీడీపీ మహిళానేతకు

## అంతిమ వీడ్కోలు

- భారీగా హాజరైన అభిమానులు, నేతలు

**ఉంగుటూరు, జూన్ 28 :** రోడ్డు ప్రమాదంలో మృతిచెందిన తెలుగుదేశంపార్టీ మండల మహిళా అధ్యక్షురాలు మండవ రమ్యకృష్ణ(33)అంత్యక్రియలు బంధుమిత్రులు, పార్టీనాయకులు, కార్యకర్తలు, మహిళానేతల అశ్రునయనాల మధ్య పెదఅవుటపల్లిలోని శ్మశానవాటికలో శుక్రవారం పూర్తయ్యాయి. చంద్రబాబు ముఖ్యమంత్రి అయిన సందర్భంగా మొక్కు తీర్చుకునేందుకు షిర్డీ వెళ్లి సాయినాథుని దర్శించుకుని తిరిగి వస్తున్న క్రమంలో మహారాష్ట్రలోని కేజ్ టౌన్ వద్ద బుధవారం తెల్లవారుజామున జరిగిన రోడ్డు ప్రమాదంలో ఆమె మృతిచెందిన విషయం తెలిసిందే. రమ్యకృష్ణ భౌతికకాయాన్ని శుక్రవారం ఉదయం 5.30గంటలకు పెదఅవుటపల్లిలోని ఆమె స్వగృహానికి తీసుకువచ్చారు. పలువురు ప్రముఖులు, పార్టీ ముఖ్యనేతలు, నాయకులు, ప్రజాప్రతినిధులు రమ్యకృష్ణ పార్థివదేహాన్ని సందర్శించి, పూలమాలలువేసి నివాళులర్పించారు.

టీడీపీ కృష్ణాజిల్లా అధ్యక్షుడు, మాజీ ఎంపీ కొనకళ్ల నారాయణ రమ్యకృష్ణ భౌతికకాయంపై పార్టీ జెండాను వుంచి జోహార్లు అర్పించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ, సాధారణ కుటుంబం నుంచి వచ్చిన రమ్యకృష్ణ వైసీపీ విధ్వంసకర పాలనపై ఎదురొడ్డి పోరాడిన ధీశాలి అన్నారు. పార్టీ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొంటూ తెలుగు మహిళలకు ఆదర్శంగా నిలిచారని కొనియాడారు. ఆమె మరణం నియోజకవర్గ తెలుగుదేశంపార్టీకి తీరని లోటన్నారు. ఆమె కుటుంబానికి పార్టీ అండగా వుంటుందని కొనకళ్ల హామీ ఇచ్చారు.

తిరుపతి పర్యటనలో వున్న గన్నవరం ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు ఫోన్‌లో రమ్యకృష్ణ భర్త శ్రీకాంత్‌ను పరామర్శించి ప్రగాఢ సానుభూతిని తెలిపారు. కృష్ణామిల్క్ యూనియన్ ఛైర్మన్ చలసాని ఆంజనేయులు, మాజీ ఎమ్మెల్యే డాక్టర్ దాసరి వెంకట బాలవర్ధనరావు, ఎమ్మెల్యే యార్లగడ్డ వెంకట్రావు సోదరుడు సతీష్, నియోజకవర్గ జనసేనపార్టీ కన్వీనర్ చలమలశెట్టి రమేష్, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండలస్థాయి నాయకులు చిరుమామిళ్ల సూర్యం, బచ్చుల సుబ్రహ్మణ్యం(బోసు), దొంతు చిన్నా, ఆళ్ల వెంకట గోపాలకృష్ణారావు, ఆరుమళ్ల వెంకట కృష్ణారెడ్డి, ఆళ్ల హనోక్, దయాల రాజేశ్వరరావు, జాస్తి వెంకటేశ్వరరావు, బోడపాటి రవికుమార్, కోనేరు సందీప్, పొదిలి దుర్గారావు, గుండపనేని ఉమావరప్రసాద్, వేములపల్లి శ్రీనివాసరావు, కొండేటి వెంకటేశ్వరరావు, గూడవల్లి నరసింహారావు, కొండేటి కొండలరావు, కలపాల కిరణ్, మూల్పూరి సాయికళ్యాణి, మండవ లక్ష్మి, తలశిల స్వర్ణలత, అంతిమయాత్రలో కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు అధికసంఖ్యలో పాల్గొని తుది వీడ్కోలు పలికారు.

## మంత్రి రవీంద్ర ప్రజాదర్బార్ నేడు

**మచిలీపట్నం టౌన్, జూన్ 28 :** కొల్లు రవీంద్ర ప్రజలకిచ్చిన వాగ్దానం మేరకు శనివారం ఉదయం 8 నుంచి 11 గంటల వరకు బృందావన్ టాకీసు పక్కన మచిలీపట్నం అసెంబ్లీ నియోజకవర్గ టీడీపీ కార్యాలయం వద్ద ప్రజాదర్బార్ నిర్వహిస్తున్నట్టు టీడీపీ సీనియర్ నేత గొర్రెపాటి గోపీచంద్ తెలిపారు. ప్రజలు తమ డివిజన్లు, గ్రామాలలోని తాగునీరు, పారిశుధ్యం, విద్యుత్, రేషన్‌కార్డులు, పింఛన్ల పంపిణీ వంటి సామాజిక సమస్యలతో పాటు వ్యక్తిగత సమస్యలను రాత పూర్వకంగా ప్రజాదర్బార్‌లో మంత్రి రవీంద్రకు ఇవ్వాలన్నారు.

## అసభ్య ప్రవర్తన కేసులో ఐదేళ్ల జైలు

**మచిలీపట్నం టౌన్, జూన్ 28 :** మైలవరం మండలం వెల్వడం గ్రామానికి చెందిన బాలికపై అసభ్యంగా ప్రవర్తించిన పత్తిపాటి రాజాకు మచిలీపట్నం పోక్సో కోర్టు శుక్రవారం ఐదేళ్ల జైలు శిక్ష విధిస్తూ తీర్పు ఇచ్చింది. 2015 నవంబరులో బాలిక స్నానం చేస్తుండగా బాత్‌రూమ్‌లోకి వెళ్లి రాజా బాలిక పట్ల అసభ్యంగా ప్రవర్తించాడు. దీనిపై పోలీసులు కేసు నమోదుచేశారు. పోక్సో జడ్జి గాజుల వెంకటేశ్వర్లు శుక్రవారం తన తీర్పులో ఐదేళ్ల జైలు శిక్ష, రూ.4వేల జరిమానా విధించారు. స్పెషల్ పబ్లిక్ ప్రాసిక్యూటర్ ఎం.వి. మహేష్‌కుమార్ ఆరుగురుని విచారించి వాదనలు వినిపించారు.

## స్వర్ణభారత్ ట్రస్ట్‌లో ఉచిత హోమియో వైద్యశిబిరం రేపటి నుంచి

**ఉంగుటూరు, జూన్ 28 :** ఆత్కూరు స్వర్ణభారత్‌ట్రస్ట్ ఆరోగ్యకేంద్రంలో ఈనెల 30 నుంచి జూలై 3వ తేదీ వరకు ఉచిత హోమియో వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు ట్రస్ట్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ పి.పరదేశి తెలిపారు. శుక్రవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ బెంగళూరుకు చెందిన జీవీ చలపతిరావు మెమోరియల్ సెల్ఫ్ రిలయన్స్ హోమియో ఫోరం సౌజన్యంతో ప్రముఖ హోమియో వైద్యులు పి.వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో ప్రతి రోజూ ఉదయం 7గంటల నుంచి సాయంత్రం 6 వరకు ఈ ఉచిత హోమియో శిబిరం నిర్వహించనున్నట్లు తెలిపారు. ప్రతి రెండు నెలలకోసారి నాలుగురోజులపాటు నిర్వహించే ఈ శిబిరాన్ని ప్రతి ఒక్కరూ సద్వినియోగం చేసుకోవాలని పరదేశి సూచించారు.



టీడీపీ నాయకుడు చింతల అప్పారావును సత్కరించి అభినందిస్తున్న విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

## చంద్రబాబు నాయకత్వంలో అభివృద్ధి పరుగులు

● విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు

**హనుమాన్‌జంక్షన్, జూన్ 28 :** వైసీపీ పాలనతో విసిగిన రాష్ట్ర ప్రజల్లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి రావడంతో హర్షాతిరేకాలు వెల్లివిరుస్తున్నాయని విజయ డెయిరీ చైర్మన్ చలసాని ఆంజనేయులు అన్నారు. శుక్రవారం స్థానిక కాకాని కల్యాణ మండపంలో టీడీపీ నాయకుడు కానుమోలు మాజీ సర్పంచ్ చింతల వెంకట శివఅప్పారావు జన్మదిన వేడుకలో చలసాని పాల్గొని అప్పారావుకు శుభాకాంక్షలు తెలియజేశారు. తెలుగుదేశం పార్టీ గుర్తుతో పోలిన కేక్‌ను చింతల అప్పారావు కట్ చేసి మిత్రులతో సంతోషాన్ని పంచుకున్నారు. ఈ సందర్భంగా చలసాని మాట్లాడుతు సీఎం చంద్రబాబు నాయుడు నాయకత్వంలో రాష్ట్రం అభివృద్ధి బాటలు పడుతుందని తెలిపారు. టీడీపీ నాయకులు దన్నే దుర్గారావు, వేగిరెడ్డి పాపారావు, జనసేన నియోజకవర్గం సమన్వయకర్త చలమలశెట్టి రమేష్ బాబు, వేగిరెడ్డి బాలాజీ, చెన్నుబోయిన శివయ్య తదితరులు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఎంపీడీవో కె.రత్నకుమారి

## సీజనల్ వ్యాధులపై అప్రమత్తంగా ఉండాలి

**హనుమాన్‌జంక్షన్, జూన్ 28 :** సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వైద్య సిబ్బంది అప్రమత్తంగా ఉండి ముందస్తు జాగ్రత్తలు తీసుకోవాలని బాపులపాడు ఎంపీడీవో కె.రత్నకుమారి వైద్య ఆరోగ్య సిబ్బంది, పంచాయతీ సిబ్బందిని ఆదేశించారు. శుక్రవారం మండల పరిషత్ కార్యాలయంలో మండలంలోని వివిధ శాఖల అధికారులతో బాపులపాడు పీహెచ్‌సీ వైద్యాధికారి ఎంజే.మంజూషా సమావేశం నిర్వహించారు. సమావేశంలో ఎంపీడీవోతో పాటు ఎంపీపీ వై.నగేష్, జడ్పీటీసీ సభ్యురాలు కె.గంగాభవాని, తహసీల్దార్ ఏ.శ్రీనివాస్ పాల్గొని సీజనల్ వ్యాధులు ప్రబలకుండా తీసుకోవాల్సిన చర్యలపై చర్చించి సమీక్ష చేశారు. తాగునీటి పథకాల్లో క్లోరినేషన్ నిర్వహించాలన్నారు. వైద్య సిబ్బంది గ్రామాల్లో ప్రజలకు అందుబాటులో ఉండాలన్నారు. సమావేశంలో ఎంఈవో రాంబాలసింగ్, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ అహ్మద్, సీహెచ్‌వో ఫణికుమార్, పీహెచ్‌సీ సూపర్ వైజర్ అప్పారావు, మాలతి తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను అభినందిస్తున్న కళాశాల కమిటీ అధ్యక్షుడు వెంకట్

## కృషి, పట్టుదలతోనే ఉత్తమ ర్యాంకులు

**గన్నవరం, జూన్ 28 :** కృషి, పట్టుదలతో విద్యార్థులు ఉత్తమ ర్యాంకులు సాధించవచ్చునని కళాశాల యాజమాన్య కమిటీ అధ్యక్షుడు మోటపర్తి వెంకట్ అన్నారు. స్థానిక వీకేఆర్ కళాశాలల్లో శుక్రవారం బైపీసీ, ఎంపీసీ, సీఈసీలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థులకు అభినందన సభ జరిగింది. ఈ సందర్భంగా వెంకట్ మాట్లాడుతూ జీవితంలో ఉన్నత స్థాయికి ఎదగాలంటే చదువుతో పాటు సాంకేతిక రంగాల్లో రాణించేలా స్వయం శక్తిని పెంచుకోవాలన్నారు. ప్రిన్సిపాల్ డి.శ్రీనివాసరావు, నవీన్‌కుమార్ తదితరులు పాల్గొన్నారు.

# కానూరు డ్రెయినేజీ వ్యవస్థపై ప్రధాన దృష్టి

**పెనమలూరు, జూన్ 28 :** కానూరుకు అత్యంత ఇబ్బందిగా మారిన డ్రెయినేజీ వ్యవస్థపైనే కసరత్తు ముమ్మరం చేశామని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ పేర్కొన్నారు. స్థానిక నాయకులు, మునిసిపల్ కమిషనర్ వెంకటేశ్వరరావుతో కలిసి కానూరులోని వివిధ ప్రాంతాల్లోని డ్రెయినేజీ వ్యవస్థను శుక్రవారం పరిశీలించారు. పూడిక తీత చేపట్టి కానూరు సనత్‌నగర్, చిన్నచెరువు, మిగిలిన ప్రాంతాల్లో డ్రెయిన్లను శుభ్రం చేయడం, కొన్ని చోట్ల రోడ్లను ఎత్తు లేపడం, ముఖ్యంగా కెన్నడీ స్కూల్, సనత్‌నగర్ లాంటి చోట్ల మురుగు రోడ్లమీద పారకుండా సరికొత్త వ్యవస్థను ఏర్పాటు చేయడం లాంటి పనులపై దృష్టి సారించామన్నారు. టీడీపీ నాయకులు అనుమోలు ప్రభాకరరావు, వెలగపూడి శంకరబాబు, కోయ ఆనంద్‌ప్రసాద్, షేక్ బుజ్జి, అంగిరేకుల మురళి, దోనెపూడి రవికిరణ్ తదితరులు ఉన్నారు.

### కమ్యూనిటీ హాలు ప్రారంభం

చోడవరం ఈబీసీ కాలనీలో రూ.25లక్షల వ్యయంతో నిర్మించిన కమ్యూనిటీ హాలును ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ప్రారంభించారు. మండల పరిషత్ నిధులు రూ.16లక్షలు, పంచాయతీ సాధారణ నిధులు తొమ్మిది లక్షలతో గత ప్రభుత్వంలో ప్రారంభించి నిర్మాణం పూర్తి కాని కమ్యూనిటీ హాలును టీడీపీ ప్రభుత్వంపూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తేవడం ఆనందకరంగా ఉందన్నారు. సర్పంచ్ కాకర్ల వెంకటరత్నం, టీడీపీ గ్రామ పార్టీ ప్రెసిడెంటు కలపాల శ్రీధర్, జనసేన నాయకులు ముప్పా రాజా, టీడీపీ నాయకులు మారుపూడి ధనకోటేశ్వరరావు, కోయ ఆనంద్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



కమ్యూనిటీ హాలును ప్రారంభిస్తున్న బోడె ప్రసాద్



రహదారిని పరిశీలిస్తున్న ఎమ్మెల్యే బోడె ప్రసాద్

### రహదారుల పరిశీలన

**కంకిపాడు :** పలు గ్రామాల్లో ఎమ్మెల్యే బోడె ప్రసాద్ శుక్రవారం విస్తృతంగా పర్యటించారు. అధ్వానంగా ఉన్న రహదారులను పరిశీలించారు. బోడె ప్రసాద్ మాట్లాడుతూ గత వైసీపీ ప్రభుత్వ హయాంలో ఒక్క చిన్న రహదారిని అయినా అభివృద్ధి చేశారా అని ప్రశ్నించారు. మద్దూరు - వణుకూరు, ఈడుపుగల్లు - ఉప్పలూరు, జగన్నాధపురం - తెన్నేరు ప్రధాన రహదారుల పరిస్థితి దయనీయంగా ఉన్నాయన్నారు. ఆయా రహదారులను పూర్తి స్థాయిలో అభివృద్ధి చేసేందుకు సమయం పడుతున్న నేపథ్యంలో ముందస్తుగా ప్యాచ్ వర్కు చేయాలన్న ఆలోచనతో ఇప్పటికే సంబంధిత శాఖ అధికారులతో మాట్లాడినట్లు చెప్పారు. ఈడుపుగల్లు సర్పంచ్ పందిపాటి ఇందిర, సుదిమళ్ల రవీంద్ర, యార్లగడ్డ రాజా, ఉద్దండి కుటుంబరావు, పందిపాటి సుధాకర్, కోనేరు సాంబయ్య, యనమదల మదన్, వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

### నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించండి

**గోసాల (కంకిపాడు) :** అంగన్‌వాడీ కేంద్రాల ద్వారా చిన్నారులకు నాణ్యమైన పౌష్టికాహారాన్ని అందించాలని ఎమ్మెల్యే బోడె ప్రసాద్ అన్నారు. పెనమలూరు మండలం గోసాల గ్రామ శివారు వైకుంఠపురంలో రూ. 15 లక్షలతో నిర్మించిన అంగన్‌వాడీ కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా బోడె ప్రసాద్ మాట్లాడుతూ గోసాల గ్రామ శివారు వైకుంఠపురంలో తమ హయాంలో 2017లో అంగన్‌వాడీ నిర్మాణానికి శంకుస్థాపన చేసినట్లు తెలిపారు. మళ్లీ తాము అధికారంలోకి వచ్చిన తరువాత ప్రారంభిస్తున్నామని అన్నారు. ఎంపీడీవో కుమార్, సీడీపీవో సుకన్య, పీఆర్‌డీఈ కె. శ్రీనివాస్, ఏఈ ఎం.వెంకటేశ్వరరావు, ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ నాంచారయ్య, గోసాల కార్యదర్శి ప్రసాద్, బీసీ సెల్ నియోజకవర్గ అధ్యక్షుడు సెంగెపు రంగారావు, టీడీపీ, జనసేన నాయకులు, అంగన్‌వాడీ సూపర్‌వైజరు, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

### టీడీపీ నేతకు ఆర్థిక సహాయం

**విజయవాడ రూరల్ :** చికిత్స పొందుతున్న టీడీపీ నేతకు నున్న గ్రామ టీడీపీ నేతలు శుక్రవారం ఆర్థిక సహాయం అందజేశారు. నున్న గ్రామానికి చెందిన జి. రాజు నాలుగు రోజుల క్రితం రోడ్డు ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్నాడు. విషయం తెలుసుకున్న గ్రామ టీడీపీ నేత బేతపూడి మురళీ, తిరుపతిరావు, కలకోటి శ్రీనివాస రెడ్డి, మాదు శివరామ్‌ప్రసాద్, పామర్తి శ్రీనివాసరావులు ఆసుపత్రిలో రాజును పరామర్శించి రూ. 13 వేలు ఆర్థిక సహాయం అందజేశారు.

# పంచాయతీని భ్రష్టు పట్టిస్తున్నారు!

● అనుమతి లేకుండా నీటి కనెక్షన్ ఇవ్వడంపై సర్పంచ్, కార్యదర్శిపై సభ్యుల ఆగ్రహం

**గన్నవరం, జూన్ 28 :** గన్నవరం పంచాయతీ పాలకవర్గ సమావేశం వాడీ వేడీగా శుక్రవారం జరిగింది. పాలకవర్గ అనుమతి లేకుండా చంద్రిక, అయోధ్య అపార్టుమెంట్‌లకు నీటి కనెక్షన్ ఏ విధంగా ఇచ్చారని సర్పంచ్, కార్యదర్శిని సభ్యులు ప్రశ్నించారు. పట్టణ ప్రజలకు తాగునీరు సరిపోవటం లేదని, అపార్టుమెంట్‌లకు ఏ విధంగా ఇచ్చారని మండిపడ్డారు.

సర్పంచ్ నిడమర్తి సౌజన్య, కార్యదర్శి అనిల్‌కుమార్ అపార్ట్‌మెంటు వాసుల వద్ద భారీగా డబ్బులు దండుకున్నారని సభ్యులు ఆరోపించారు. దీనిలో ప్లంబర్ దానియేలు పాత్ర కూడా ఉందన్నారు. పంచాయతీలో పని చేసే అటెండర్ రూ.84 వేలు జీతం తీసుకుంటూ విధులకు రావడం లేదన్నారు. అతడికి సర్పంచ్, కార్యదర్శి సహకరిస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. పంచాయతీ కార్యాలయంలో సీఎం ఫొటో లేకపోవటంపై ఉపసర్పంచ్ పాలడుగు నాని, ఎంపీటీసీ సభ్యుడు పడమట రంగారావు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. సర్పంచ్, కార్యదర్శి పంచాయతీని భ్రష్టు పట్టిస్తున్నారని ధ్వజమెత్తారు. అనంతరం అక్రమ నీటి కనెక్షన్‌ను పరిశీలించి తొలగింపజేశారు. సమావేశాన్ని సోమవారానికి వాయిదా వేశారు.



అక్రమ నీటి కనెక్షన్‌పై ప్రశ్నిస్తున్న సభ్యులు

## నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా

**మల్లవాడ (పమిడిముక్కల) :** పామర్రును అభివృద్ధిలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. ఎన్నికల్లో ఘనవిజయం సాధించి ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలసారి వస్తున్న కుమార్‌రాజాకు గోపువానిపాలెం, మల్లవాడ ప్రజలు శుక్రవారం అపూర్వస్వాగతం పలికారు. మంచి మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటా నన్నారు. వర్ల రామయ్య, గోపువాని పాలెం సర్పంచ్ భూషయ్య, మల్లవాడ సర్పంచ్ ఫ్రాన్సిస్, జనసేన నాయకుడు తాడిశెట్టి నరేశ్, టీడీపీ నాయకులు చలసాని రమేశ్, సూరపనేని సత్యనారాయణ, వెంకటనారాయణ, రాజేంద్రప్రసాద్, జక్కా శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.



మల్లవాడలో ఎమ్మెల్యే కుమార్ రాజాకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు



## గోమాతకు సీమంతం

**ఉయ్యూరు, జూన్ 28 :** శ్రీజగదాంబ సమేతసోమేశ్వర స్వామి ఆలయంలో శుక్రవారం గోమాతకు వైభవంగా సీమంతం నిర్వహించారు. స్వామివారి ఆలయం గోశాలలో ఉన్న ఒంగోలుజాతి ఆవుకు ఏడో నెలలో సీమంతం జరిపించారు. ఆలయ అధికారులు, లలిత పారాయణ బృందం, పట్టణ ప్రజలు పాల్గొని పూజలు చేశారు.



## కాలినడకన ద్వారకా తిరుమలకు తెలుగు మహిళలు

**హనుమాన్‌జంక్షన్, జూన్ 28 :** చంద్రబాబు ముఖ్యమంత్రిగా బాధ్యతలు చేపట్టిన నేపథ్యంలో ఓగిరాల గ్రామ తెలుగు మహిళలు కాలినడకన మొక్కు తీర్చుకోవడానికి శుక్రవారం ద్వారకా తిరుమలకు పాదయాత్ర చేపట్టారు. ముందుగా అభయాంజనేయ స్వామి ఆలయంలో పూజలు నిర్వహించి కాలినడక వెళ్లారు. బాపులపాడు మండల టీడీపీ అధ్యక్షుడు దయాల రాజేశ్వరరావు వారిని అభినందించి జెండా ఊపి వీడ్కోలు పలికారు. టీడీపీ నాయకులు సోంబాబు,గుండపనేని ఉమావరప్రసాద్, వేగిరెడ్డి పాపారావు తదితరులు పాల్గొని మహిళలకు పాదయాత్ర దిగ్విజయంగా సాగాలని కోరుతు శుభాభినందనలు తెలియజేశారు.





## టిడ్కో ఇళ్లు మంజూరుకాని వారికి డిపాజిట్ తిరిగి చెల్లింపు నేడు

**ఉయ్యూరు, జూన్ 28 :** ఉయ్యూరు నగర పంచాయతీ పరిధిలో టిడ్కో ఇళ్లు మంజూరు కాని వారికి డిపాజిట్ తిరిగి చెల్లిస్తున్నట్లు కమిషనర్ పాయసం వెంకటేశ్వరరావు శుక్రవారం ప్రకటనలో తెలిపారు. శనివారం ఉదయం 10 గంటలకు నగర పంచాయతీ కార్యాలయం వద్ద ఏర్పాటు చేసిన కార్యక్రమంలో నగర పంచాయతీ చైర్మన్ వి.సత్యనారాయణ ఆధ్వర్యంలో పెనమలూరు ఎమ్మెల్యే బోడె ప్రసాద్ ద్వారా డిపాజిట్ చెక్కులు అందజేయనున్నట్లు తెలిపారు.

ఎమ్మెల్యేగా ఎన్నికైన తరువాత తొలిసారి నగర పంచాయతీ కార్యాలయానికి వస్తున్న ఆయనకు సన్మాన కార్యక్రమం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.

## ముదునూరులో ఉచిత వైద్యశిబిరం రేపు

**ఉయ్యూరు, జూన్ 28 :** ముదునూరులో ఆదివారం ఉదయం 9 నుంచి మధ్యాహ్నం 2గంటల ఉచిత వైద్యశిబిరం నిర్వహిస్తున్నట్లు సర్పంచ్ వెంకట నాగలక్ష్మి తెలిపారు.

మండలపరిషత్ ప్రాథమిక పాఠశాల ఆవరణలో విజయవాడ సెంటినీ హాస్పిటల్ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న వైద్యశిబిరంలో ప్రముఖ గుండె, ఇతర వ్యాధుల నిపుణులు హాజరై బీపీ, షుగరు, ఈసీజీ, 2డీఎకో పరీక్షలు చేస్తారని ముదునూరు, పరిసర గ్రామాల ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని తెలిపారు.



రాజేంద్రప్రసాద్‌కు అభినందనలు తెలుపుతున్న స్వయం సహాయ సంఘాల లీడర్లు

## కూటమితోనే అన్ని వర్గాల అభ్యున్నతి

● వైవీబీ రాజేంద్రప్రసాద్

**ఉయ్యూరు, జూన్ 28 :** రాష్ట్రంలో తెలుగుదేశం, జనసేన, బీజేపీ కూటమి ప్రభుత్వంలో అన్ని వర్గాల అభివృద్ధి, సంక్షేమం సమకూరుతుందని టీడీపీ రాష్ట్ర ఉపాధ్యక్షుడు వైవీబీ రాజేంద్రప్రసాద్ అన్నారు. కూటమి అధికారంలోకి వచ్చిన సందర్భంగా పార్టీల నాయకులు, స్వయం సహాయక సంఘాల లీడర్లు, ఎండీయూలు శుక్రవారం రాజేంద్రప్రసాద్‌ను కలసి పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ చంద్రబాబు మేనిఫెస్టోలో ఇచ్చిన హామీలు నెరవేర్చే దిశగా అడుగులు వేస్తున్నారని, జూలై 1న సచివాలయ సిబ్బంది చేత రూ. 7వేల సామాజిక పింఛన్ ఇంటికి తీసుకు వచ్చి ఇచ్చే ఏర్పాట్లు చేశారన్నారు. హామీలన్నింటిని తప్పక నెరవేర్చి ఇచ్చిన మాట నిలబెట్టుకుంటారని పేర్కొన్నారు.



ముదునూరు- సాయిపురం సమీపాన చంద్రయ్య కాల్వపై ప్రమాదకరంగా ఉన్న వంతెన

## ప్రమాదకరంగా చంద్రయ్య కాల్వపై వంతెన

**సాయిపురం(ఉయ్యూరు), జూన్ 28 :** సాయిపురం - ముదునూరు మధ్య చంద్రయ్య కాల్వపై వంతెన శిథిలావస్థకు చేరుకుంది. ఈ వంతెన ఎప్పుడు కూలుతుందోనని ఆయా గ్రామాల ప్రజలు భయాందోళన చెందుతున్నారు. బ్రిటీషువారి సమయంలో నిర్మించిన వంతెన పునాదులవద్ద గోడలు పెచ్చులూడి ప్రమాదకరంగా ఉన్న పరిస్థితుల్లో భయం భయంగా వాహనదారులు ప్రయాణిస్తున్నారు. రెండు గ్రామాల వ్యవసాయ ఉత్పత్తులు, ఇతర సామాగ్రి చేరవేసే వాహనాలు ఈ వంతెనపై నుంచి వెళుతుంటాయి. ఖరీఫ్ సీజన్ ప్రారంభమైన నేపథ్యంలో రైతులు పొలాలకు వెళ్లి పనులు చేయడానికి ఆందోళన చెందుతున్నారు.



## హోం మంత్రి అనితను కలిసిన స్వర్ణలత

నాగాయలంక, జూన్ 28 : జిల్లా తెలుగు మహిళా అధ్యక్షురాలు తలశిల స్వర్ణలత శుక్రవారం మంగళగిరిలోని టీడీపీ కేంద్ర కార్యాలయంలో పాయకరావుపేట నుంచి ఎమ్మెల్యేగా గెలిచి హోం మంత్రి అయిన వంగలపూడి అనితను మర్యాద పూర్వకంగా కలిశారు. ఆమెకు పుష్పగుచ్ఛం అందజేసి శుభాకాంక్షలు తెలియజేశారు. ప్రత్యేకంగా అభినందించారు. మహిళల సమస్యలపై ఆమెతో చర్చించారు.

## భువనేశ్వరిని కలిసిన టీడీపీ నేతలు



**చల్లపల్లి :** పాగోలు ఎన్టీఆర్ మోడల్ స్కూల్‌కు వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబు సతీమణి, ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరిని స్థానిక ప్రముఖులు, టీడీపీ నేతలు మర్యాదపూర్వకంగా కలిశారు. విజయ అకాడమీ ప్రిన్సిపాల్ నాగళ్ల భీమారావు, యువ పారిశ్రామికవేత్త గుత్తికొండ వంశీకృష్ణ, మండల టీడీపీ అధ్యక్ష కార్యదర్శులు మోర్ల రాంబాబు, యార్లగడ్డ శ్రీనివాసరావు, వేమూరి రమేష్‌బాబు, మేకా వెంకటేశ్వరరావు, మేకా పెద్దబ్బాయ్, మల్లంపల్లి శివరామకృష్ణ, వక్కలగడ్డ శివరామకృష్ణ, వాసిరెడ్డి రాకేష్, చోడాబత్తిన ఆదినారాయణ తదితరులు భువనేశ్వరిని కలిశారు.



## మంత్రులు రవీంద్ర, పార్థసారథిలకు వేణు శుభాకాంక్షలు

**పెడన, జూన్ 28 :** జిల్లా నుంచి మంత్రులుగా నియమితులైన కొల్లు రవీంద్ర, కొలుసు పార్థసారథిలను పెడన మునిసిపల్ మాజీ ఛైర్మన్, రాష్ట్ర బీసీ కార్పొరేషన్ మాజీ ఛైర్మన్ బొడ్డు వేణుగోపాలరావు శుక్రవారం మర్యాద పూర్వకంగా కలిశారు. మంత్రులిద్దరినీ సత్కరించి శుభాకాంక్షలు తెలిపారు. పట్టణ టీడీపీ అధ్యక్షుడు యక్కల శ్యామలయ్య, అగస్తేశ్వర స్వామి ఆలయ అభివృద్ధి కమిటీ సభ్యుడు కమ్మగంటి బాబు పాల్గొన్నారు.

## రామకృష్ణ ఆధ్వర్యంలో క్లీన్ అండ్ గ్రీన్



**మచిలీపట్నం టౌన్ :** పారిశుధ్యం, తాగునీటి సమస్యలను వైసీపీ పాలకులు నిర్లక్ష్యం చేశారని జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ అన్నారు. నగరంలో 50 రోజుల కార్యక్రమంలో భాగంగా మూడో రోజు రెండో డివిజన్‌లో క్లీన్ అండ్ గ్రీన్ కార్యక్రమం నిర్వహించారు. నగరపాలక సంస్థ అధికారులతో డ్రెయిన్ల పూడికతీత పనులు చేయించారు. బండి రామకృష్ణ మాట్లాడుతూ, బందరు నగరంలో పారిశుధ్యంపై స్పెషల్ డ్రైవ్ నిర్వహిస్తున్నామన్నారు. మంత్రి కొల్లు రవీంద్ర సారథ్యంలో నగరాన్ని సుందరంగా తీర్చిదిద్దాలన్నారు. టీడీపీ నాయకులు పల్లపాటి సుబ్రహ్మణ్యం, గుమ్మడి విద్యాసాగర్, జనసేన నాయకులు వంపుగడల చౌదరి, మణి తదితరులు పాల్గొన్నారు.



ఉచిత నేత్ర వైద్యశిబిరంలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే కుమార్‌రాజా

## ఉచిత నేత్ర వైద్యసేవలు అభినందనీయం

**కూచిపూడి :** ఉచిత నేత్ర వైద్యసేవలు అభినందనీయమని ఎమ్మెల్యే కుమార్ రాజా అన్నారు. శంకర్ నేత్రాలయ కంటి వైద్యశాల, చెన్నై, నటరాజ నాట్యాంజలి యుఎస్ఏల సంయుక్త ఆధ్వర్యంలో శుక్రవారం కూచిపూడిలో నిర్వహించిన ఉచిత కంటి వైద్యశిబిరంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. పెదముత్తేవి శ్రీకృష్ణాశ్రమ నిర్వాహకులు ముత్తేవి గౌరవ కృష్ణ జ్యోతి వెలిగించి శిబిరాన్ని ప్రారంభించారు. తొలి రోజు 150 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. నేత్రాలయ మేనేజర్ అరుల్ - శివ నీలిమ దంపతులు, గడ్డమనుగు శ్రీనివాస్, మండల టీడీపీ అధ్యక్షుడులింగమనేని రామలింగేశ్వరరావు, జిల్లా ఉపాధ్యక్షుడు నన్నపనేని వీరేంద్ర, కొండవీటి అమర బాలేశ్వరరావు, కోసూరు ఆదినారాయణరావు పాల్గొన్నారు. ఎమ్మెల్యే అనిల్ కుమార్‌ను నిర్వాహకులు దుశ్శాలువా, పూలమాలలతో ఘనంగా సత్కరించారు.

## కాల్వలో పూడికతీత చేపట్టాలి : సీపీఎం



**గుడివాడ రూరల్ :** కాల్వలు, డ్రెయిన్లలో పూడికతీత చేపట్టాలని సీపీఎం నేత ఆర్‌సిపి రెడ్డి డిమాండ్ చేశారు. మోటారు చానల్‌ను శుక్రవారం పరిశీలించారు. ఐదేళ్లుగా రాష్ట్రంలో పంట కాల్వలు, డ్రెయిన్ల అభివృద్ధిని వైసీపీ ప్రభుత్వం పట్టించుకోలేదన్నారు. పంటకాలువలన్నీ తూడు, గుర్రపు డెక్కతో నిం డిపోయి ఉన్నాయని, తక్షణమే పూడికతీత చర్యలు చేపట్టాలన్నారు. దివి వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.





స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమాలను కలెక్టర్ డీకే బాలాజీకి వివరిస్తున్న స్వచ్ఛ చల్లపల్లి సారథి డాక్టర్ డీఆర్కే ప్రసాద్



నాగాయలంకలో జలక్రీడల అకాడమీ భవనాన్ని పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్యే బుద్ధప్రసాద్

# ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, టీ గ్లాసులను నిషేధించండి

• ప్రజా చైతన్య కార్యక్రమాలు చేపట్టండి • స్వచ్ఛ చలపల్లి సారథులకు కలెక్టర్ సూచన

**చల్లపల్లి, జూన్ 28 :** పర్యావరణానికి హాని కలిగించే ప్లాస్టిక్ క్యారీ బ్యాగ్‌లు, టీ గ్లాసులను నిషేధించాలని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ సూచించారు. చల్లపల్లిలోని సంపద తయారీ కేంద్రాన్ని ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలిసి శుక్రవారం పరిశీలించారు. వర్మికంపోస్టు తయారీని, డంపింగ్ యార్డులోని చెత్తను పరిశీలించిన కలెక్టర్ చెత్తసేకరణపై వివరాలు తెలుసుకున్నారు. స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమం ద్వారా చల్లపల్లిలో సాధించిన ప్రగతిని, మొక్కల పెంపకం, స్వచ్ఛ కార్యక్రమాల వివరాలను స్వచ్ఛ సారథులు డాక్టర్ డీఆర్‌కె.ప్రసాద్, డాక్టర్ పద్మావతి కలెక్టర్‌కు వివరించారు. కలెక్టర్ మాట్లాడుతూ, గ్రామంలో క్యారీ బ్యాగ్‌ల వాడకం రద్దుచేయాలన్నారు. ఆ అధికారం గ్రామ పంచాయతీకి ఉందన్నారు. విక్రయదారులకు నచ్చచెప్పటం, ప్రజలకు అవగాహన కల్పించటం ద్వారానే నియంత్రణ సాధ్యమవుతుందన్నారు. ఘర్షణ వాతావరణం కలగకుండా ప్రజలను చైతన్యవంతులను చేస్తూ నిషేధాన్ని అమలుపరచాలని తెలిపారు. చల్లపల్లికి మరోసారి వస్తాననీ, అందరితో సమావేశం ఏర్పాటు చేద్దామని కలెక్టర్ చెప్పారు. స్వచ్ఛ చల్లపల్లి కార్యక్రమాల నిర్వహణపై డీఆర్కే దంపతులకు అభినందనలు తెలిపారు. ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్, యువనేత మండలి వెంకట్రామ్, సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, ఉపసర్పంచ్ ముమ్మనేని నాని, వివిధ శాఖల ఉన్నతాధికారులు, మండల స్థాయి అధికారులు పాల్గొన్నారు.

### జలక్రీడల భవనాన్ని త్వరలో పూర్తి చేస్తాం

**నాగాయలంక :** జలక్రీడల అకాడమీ భవనాన్ని, ఫుడ్‌కోర్టు భవనాల నిర్మాణాన్ని త్వరలోనే పూర్తి చేస్తామని కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. నాగాయలంకలో రూ.2.50 కోట్లతో నిర్మిస్తున్న ఐదేళ్లుగా అసంపూర్తిగా ఉన్న జలక్రీడల అకాడమీ భవనాన్ని, రూ.40 లక్షలతో నిర్మిస్తున్న ఫుడ్ కోర్టు భవనాలను అవనిగడ్డ ఎమ్మెల్యే మండలి బుద్ధప్రసాద్‌తో కలసి కలెక్టర్ డీకేబాలాజీ పరిశీలించారు. నిర్మాణంలో జాప్యాన్ని అధికారులను కలెక్టర్ అడిగి తెలుసుకున్నారు. నిధులు మంజూరు చేసి భవనాలను త్వరలోనే పూర్తి చేస్తామన్నారు. జలక్రీడల జాతీయ క్రీడాకారిణి నాగిడి గాయత్రిని ఎమ్మెల్యే, అధికారులు కలెక్టర్‌కు పరిచయం చేశారు. గాయత్రిని ప్రోత్సహించేందుకు కేంద్రం నుంచి నిధులు కోసం నివేదికలు తయారు చేయాలని క్రీడల అభివృద్ధి అధికారులను ఆయన ఆదేశించారు. పంచాయతీ రాజ్ ఎస్ఈ విజయ కుమార్, ఈఈ శ్రీనివాసరావు, డీఆర్వో చంద్రశేఖరరావు, ఇన్‌చార్జ్ ఆర్డీవో శ్రీదేవి, జిల్లా క్రీడల అభివృద్ధి అధికారి ఝాన్సీ, తహసీల్దార్ ఎం.హరనాథ్‌బాబు, ఎంపీడీవో కె.సీతారామకుమార్, మండలి వెంకట్రామ్, మండవ బాలవర్ధిరావు, కైతేపల్లి అంకాలు, లకనం నాగాంజనేయులు, తలశిల రఘుశేఖర్, లంకే శ్రీనివాస ప్రసాద్‌తో, వివిధ శాఖ అధికారులు పాల్గొన్నారు. తొలి సారిగా నాగాయలంక వచ్చిన సందర్భంగా ఆయనకు అధికారులు, గ్రామస్థులు సాదర స్వాగతం పలికారు.

### సమస్యల పరిష్కారానికి తక్షణ చర్యలు : ఎమ్మెల్యే వెనిగండ్ల

**గుడివాడ :** ప్రజాసమస్యల పరిష్కారానికి వెంటనే చర్యలు చేపట్టాలని ఎమ్మెల్యే వెనిగండ్ల రాము అన్నారు. ప్రజావేదికలో పురపాలక సంఘం అధికారులతో శుక్రవారం ఆయన సమీక్షా సమావేశం నిర్వహించారు. వర్షాకాలం ప్రారంభమైన దృష్ట్యా డ్రెయిన్లలో సిల్ట్ తొలగింపు పనులను వేగవంతం చేయాలన్నారు. ప్రధాన రహదారుల అభివృద్ధికి అంచనాలను రూపొందించాలన్నారు. మున్సిపల్ కమిషనర్ బాలసుబ్రహ్మణ్యం, మున్సిపల్ ఎంఈ విజయదుర్గ, డీఈ ప్రవీణ్, మున్సిపల్ మాజీ ఛైర్మన్ యలవర్తి శ్రీనివాసరావు, మున్సిపల్ ఏఈలు, టీడీపీ నాయకులు పాల్గొన్నారు.

# నియోజకవర్గ ప్రజల రుణం తీర్చుకుంటా

• ఎమ్మెల్యే కుమార్ రాజా



మర్రివాడలో ఎమ్మెల్యే కుమార్ రాజాకు హారతులిచ్చి స్వాగతం పలుకుతున్న మహిళలు

**మర్రివాడ (పమిడిముక్కల) :** పామర్రును అభివృద్ధిలో మోడల్ నియోజకవర్గంగా తీర్చిదిద్దుతానని ఎమ్మెల్యే వర్లకుమార్ రాజా అన్నారు. ఎన్నికల్లో ఘనవిజయం సాధించి ఎమ్మెల్యేగా బాధ్యతలు స్వీకరించిన తరువాత తొలసారి వస్తున్న కుమార్‌రాజాకు గోపువానిపాలెం, మర్రివాడ ప్రజలు శుక్రవారం అపూర్వస్వాగతం పలికారు. మంచి మెజారిటీతో గెలిపించిన ప్రజల రుణం తీర్చుకుంటా నన్నారు. వర్ల రామయ్య, గోపువాని పాలెం సర్పంచ్ భూషయ్య, మర్రివాడ సర్పంచ్ ఫ్రాన్సిస్, జనసేన నాయకుడు తాడిశెట్టి నరేశ్, టీడీపీ నాయకులు చలసాని రమేశ్, సూరపనేని సత్యనారాయణ, వెంకటనారాయణ, రాజేంద్రప్రసాద్, జక్కా శ్రీనివాసరావు, జనసేన, బీజేపీ నాయకులు పాల్గొన్నారు.

### మొవ్వ జడ్పీ విద్యార్థులకు విద్యా కిట్ల పంపిణీ

**కూచిపూడి :** ప్రభుత్వం అందిస్తున్న రాయితీలను సద్వినియోగం చేసుకుని విద్యార్థులు ఉత్తమ ఫలితాలు సాధించాలని ఎమ్మెల్యే వర్ల కుమార్ రాజా పేర్కొన్నారు. మొవ్వ జడ్పీ పాఠశాలలో స్కూల్ బ్యాగ్‌లు, కిట్లను శుక్రవారం అందజేశారు. సర్పంచ్ తూము పూర్ణచంద్రరావు, జడ్పీ కో-ఆప్షన్ సభ్యులు వేమూరి పరిశుద్ధ రాజు, టీడీపీ మండల పార్టీ అధ్యక్షులు లింగమనేని రామలింగేశ్వరరావు, మండవ రత్నగిరిరావు, మండల శ్రీకృష్ణ, మండవ కోటేశ్వరరావు, పాఠశాల ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

### ఇంటి వద్దే పింఛన్ల పంపిణీ

**గుడివాడ రూరల్ :** సామాజిక పింఛన్ల పంపిణీకి అన్ని ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎంపీడీవో జ్యోతి తెలిపారు. గ్రామ సచివాలయ ఉద్యోగులు, కార్యదర్శులు పింఛన్లు అందజేస్తారన్నారు. ఇంటి వద్దే పింఛన్లు అందించటానికి తగు ఏర్పాట్లు చేశామన్నారు. **పెదపారుపూడి :** జూలై 1వ తేదీన పింఛన్లను ఇంటి వద్దే సచివాలయ సిబ్బందితో పంపిణీ చేయించటం జరుగుతుందని ఎంపీడీవో టి.సీతామహాలక్ష్మి తెలిపారు. లబ్ధిదారులు ఇళ్ల వద్దనే ఉండాలని కోరారు.

### పెడన కౌన్సిల్ సమావేశం నేడు

**పెడన :** పెడన మునిసిపల్ కౌన్సిల్ సాధారణ సమావేశం శనివారం ఉదయం 11 గంటలకు జరుగుతుందని కమిషనర్ బి. వెంకట్రామయ్య తెలిపారు. ఛైర్‌పర్సన్ కటకం నాగకుమారి అధ్యక్షతన జరిగే సమావేశంలో అజెండాలోని 21 అంశాలపై చర్చించి నిర్ణయాలు తీసుకోవడం జరుగుతుందన్నారు.

## బహుముఖ ప్రజ్ఞాశాలి పీవీ



**మచిలీపట్నం టౌన్, జూన్ 28 :** బహుముఖ ప్రజ్ఞాశాలి మాజీ ప్రధాని పివి నరసింహారావు అందరికీ ఆదర్శమని టీడీపీ రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కొనకళ్ళ బుల్లయ్య అన్నారు. పీవీ జయంతి సందర్భంగా ప్రధాన పార్కులోని పీవీ విగ్రహానికి పలువురు ప్రముఖులు నివాళులర్పించారు. గొర్రెపాటి గోపీచంద్, గోపు సత్యనారాయణ, బండి రామకృష్ణ, ఇలియాస్ పాషా, సమతాకీర్తి, విద్యాసాగర్, వెంకట నరసింహారావు, కరెడ్ల సుశీల, లంకే శేషగిరిరావు, గడ్డం రాజు, కట్టా దుర్గ, కరెడ్ల సుశీల, శ్రీరామచంద్రమూర్తి, శేషయ్యానాయుడు, కె.వి.వి. సత్యనారాయణ, న్యాయవాది లంకిశెట్టి బాలాజీ, వేమూరి రామకృష్ణ, శివరాం, బ్రహ్మానంద శాస్త్రి, కుటుంబ శాస్త్రి, వి.ఎస్.ఎస్.ఆర్. శర్మ తదితరులు పాల్గొన్నారు. **అవనిగడ్డ :** గాంధీక్షేత్రంలో మాజీ ప్రధాని పీవీ విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కొల్లూరి వెంకటేశ్వరరావు, మర్రే గంగయ్య, బచ్చు వెంకటనాథ్, మాచవరపు ఆదినారాయణ, మండలి శేషగిరిరావు, ఘంటసాల రాజమోహనరావు, బొప్పన భాను, దున్నా రాజేష్ తదితరులు పాల్గొన్నారు. కాంగ్రెస్ పార్టీ కార్యాలయంలో ఆది రామ్మోహనరావు నివాళులర్పించారు.







## లయన్స్ క్లబ్ అధ్యక్షుడు సాయిబాబుకు జనసేన సత్కారం

**కోడూరు :** లయన్స్ క్లబ్ అధ్యక్షుడిగా పదవసారి ఎన్నికైన ఆసుపత్రి అభివృద్ధి కమిటీ మాజీ ఛైర్మన్ పూతబోయిన సీతారత్న సాయిబాబును మండల జనసేన పార్టీ నాయకులు శుక్రవారం ఘనంగా సత్కరించారు. మండల పార్టీ అధ్యక్షుడు మర్రే గంగయ్య, కోట రాంబాబు, యర్రంశెట్టి దామోదరరావు, కొండవీటి రామకృష్ణ, బడే గాంధీ, కాగిత రామారావు, గోగినేని మల్లిఖార్జునరావు, బావిశెట్టి ప్రభాకర్‌రావు, కడవకొల్లు రంగారావు, మల్లి, పూతబోయిన లక్ష్మణరావు, కోట ప్రసాద్, బడే వెంకట్రావు, కంచర్లపల్లి వెంకట రమణ, మేడా పిచ్చియ్య, కోట సుబ్బారావు, బండే గోపాలకృష్ణ, బడే వెంకట స్వామి, అప్పికట్ల వినోద్, తుంగల నారాయణ తదితరులు పాల్గొన్నారు.

### అగ్నిబాధిత కుటుంబానికి జనసేన ఆర్థిక సాయం

**చల్లపల్లి :** నారాయణరావు నగర్ కాలనీ ఎస్టీ ప్రాంతంలో అగ్నిబాధిత గరికపాటి యశోదకు జనసైనికులు సాయమందించారు. జనసేన నాయకుడు అడపా రాంబాబు, జనసైనికులు కలిసి రూ.10 వేలను యువనేత మండలి వెంకట్రామ్ చేతులమీదుగా బాధితురాలికి అందజేశారు. సర్పంచ్ పైడిపాముల కృష్ణకుమారి, వైస్ ఎంపీపీ మోర్ల రాంబాబు, పెద్దలు ఆకుల స్వభూప్రసాద్, జీవి.తాతారావు, నేతలు తోట కనకదుర్గ, బొందలపాటి వీరబాబు, గంగిశెట్టి రాజేంద్ర, పసుపులేటి రవికుమార్, కొడాలి మురళి, రావి చిట్టి, యన్నం చంద్రయ్య, రేవతి, మంచికంటి కిరణ్ పాల్గొన్నారు.

### డయేరియా నివారణకు జాగ్రత్తలు

**బంటుమిల్లి :** డయేరియా వ్యాపించకుండా తగు జాగ్రత్తలు తీసుకోవాలని బంటుమిల్లి వైద్యాధికారిణి డాక్టర్ సౌందర్య అన్నారు. వెలుగు కార్యాలయంలో శుక్రవారం జరిగిన సమావేశంలో మాట్లాడుతూ జులై 1వ తేదీ నుంచి ఆగస్టు 31వ తేదీ వరకూ ఇంటింటా తిరుగుతూ డయేరియా నివారణపై అవగాహన కల్పించాలన్నారు. వ్యక్తిగత, పరిసరాల పరిశుభ్రత పాటిస్తూ, నీరు, ఆహారం కలుషితం కాకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు. బంటుమిల్లి, నాగేశ్వరరావు పేట, అర్తమూరు బావుల్లో క్లోరినేషన్ చేశారన్నారు. డిప్యూటీ తహసీల్దార్ రామశివ, ఎంపీడీవో రామకృష్ణంరాజు, సీడీపీవో సముద్రవేణి, ఆర్‌డబ్ల్యూఎస్, ఏఎన్ఎంలు ఆశాలు పాల్గొన్నారు.

### మాతంగి మృతి తీరని లోటు

**గుడివాడ :** మాతంగి రామచంద్రరావు మృతి తీరనిలోటని బొల్లాపల్లి ఎంపీడీవో వేమూరి విజయ్‌కుమార్ అన్నారు. ఎన్‌జీవోస్ హోంలో ఏర్పాటు చేసిన మాతంగి సంస్మరణ సభలో ఆయన మాట్లాడుతూ మాతంగి గ్రామీణ పేద ప్రజలకు న్యాయం అందించారన్నారు. మాతంగి ప్రకాష్‌బాబు, పరిరక్షణ ఐక్యవేదిక ఏలూరు జిల్లా కన్వీనర్ ఎల్.ఎస్.భాస్కరరావు, పీపీ కోరే మురళీ, బార్ అసోసియేషన్ అధ్యక్షుడు కొడాలి హరనాథ్, కార్యదర్శి ఎం.నటరాజన్, న్యాయవాదులు రాజేంద్రప్రసాద్, అజయ్‌బాబు పాల్గొన్నారు.

### ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు కంప్యూటర్ ల్యాబ్

**అవనిగడ్డ :** స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలకు రూ.22 లక్షల ఖరీదైన 43 కంప్యూటర్లను ప్రభుత్వం అందజేసినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్‌డి.ఉమారాణి తెలిపారు. బీఎస్సీ కంప్యూటర్స్, బీకాం కంప్యూటర్స్ విద్యార్థులతోపాటు అన్ని గ్రూపుల విద్యార్థులకు కంప్యూటర్ ల్యాబ్ సౌకర్యం కల్పించామన్నారు. ఆన్‌లైన్ కోర్సులను ఉపయోగించుకుని సాఫ్ట్‌వేర్ రంగంలో అవకాశాలను అందిపుచ్చుకోవటానికి ఇంటర్ పాసై డిగ్రీలో అడుగు పెడుతున్న గ్రామీణ విద్యార్థులకు ఇదొక సువర్ణ అవకాశమని ప్రిన్సిపాల్ ఉమారాణి తెలిపారు.

### విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో ఇల్లు దగ్ధం

**అవనిగడ్డ రూరల్ :** కొత్తపేట గ్రామంలో విద్యుత్ షార్ట్ సర్క్యూట్‌తో చేబ్రోలు వినయ్ ఇల్లు గురువారం రాత్రి దగ్ధమైంది. కుటుంబసభ్యులు ఇంటి వద్ద లేకపోవటంతో ప్రాణ నష్టం తప్పింది. అవనిగడ్డ అగ్నిమాపక శాఖ సిబ్బంది మంటలను అదుపు చేశారు. బాధిత నిరుపేద కుటుంబం కట్టుబట్టలతో నిరాశ్రయులుగా మిగిలారు. బాధిత కుటుంబానికి మాలమహానాడు జిల్లా అధ్యక్షుడు దోవా గోవర్ధన్ బియ్యం, నిత్యావసర సరుకులు పంపిణీ చేశారు. ప్రభుత్వం వారికి ఇంటి స్థలం, పక్కా గృహం ఏర్పాటు చేయాలని ఆయన కోరారు. నియోజకవర్గ ఇన్‌చార్జ్ బొంతు నరేష్ తదితరులు పాల్గొన్నారు.

### బోరు వరల్లో పడి ఎద్దు మృతి



**తోట్లవల్లూరు :** రొయ్యూరు శివారు రావిచెట్టులంకకు చెందిన రైతు ఎద్దు శుక్రవారం పొలంలోని బోరు వరల్లో పడి మృతి చెందింది. కస్తూరి రమణ తన రెండు ఎద్దులను పొలంలో మేతకు వదిలి పని చేసుకుంటున్నాడు. ఒక ఎద్దు మేస్తు బోరు వరల్లో పడి అల్లాడిపోయింది. గ్రామస్తులు వందమంది వచ్చినా బయటకు తీసేందుకు వీల్లేకుండా పోయింది. కొంతసేపటికి ప్రాణాలు విడిచింది. రూ లక్ష విలువైన ఎద్దు చనిపోవటంతో రైతు రమణ కుటుంబం కన్నీరు మున్నీరయ్యారు. ఎద్దుకు అంత్యక్రియలు నిర్వహించారు.

### కార్యకర్తలే పార్టీకి అండ

**మచిలీపట్నం టౌన్ :** కార్యకర్తలే పార్టీకి అండ అని టీడీపీ రాష్ట్ర నాయకుడు కొనకళ్ళ బుల్లయ్య, గొర్రెపాటి గోపీచంద్ అన్నారు. శుక్రవారం 39వ డివిజన్‌లో కట్టా దుర్గ జన్మదిన వేడుకలు జరిగాయి. నాయకులు లొల్లా కుటుంబ శాస్త్రి, పి.వి. ఫణికుమార్, గుమ్మడి విద్యాసాగర్‌తో పాటు జనసేన నియోజకవర్గ ఇన్‌చార్జి బండి రామకృష్ణ, గడ్డం రాజు, వంపుగడల చౌదరి తదితరులు పాల్గొన్నారు.

## ఏసీబీ డీజీగా అతుల్ సింగ్

**» రాష్ట్రంలో సీనియర్ ఐపీఎస్‌ల బదిలీలు**

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్ర ప్రభుత్వం ముగ్గురు సీనియర్ ఐపీఎస్ అధికారులను బదిలీ చేసింది. సీఐడీ అధిపతిగా విశాఖపట్నం పోలీస్ కమిషనర్ రవిశంకర్ అయ్యన్నార్‌ను నియమించింది. అవినీతి నిరోధక శాఖ డీజీగా పూర్తిస్థాయి అదనపు బాధ్యతలు నిర్వహిస్తున్న ఏపీఎస్పీ బెటాలియన్ చీఫ్ అతుల్ సింగ్‌ను ఏసీబీకి పరిమితం చేసింది. శాంతి భద్రతల ఏడీజీగా ఉన్న శంఖబ్రత బాగ్చీని విశాఖపట్నం పోలీస్ కమిషనర్‌గా బదిలీ చేస్తూ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి నీరబ్ కుమార్ ప్రసాద్ శుక్రవారం ఉత్తర్వులు జారీ చేశారు. ఎన్నికల సమయంలో రాష్ట్ర డీజీపీగా నియమితులైన హరీశ్ కుమార్ గుప్తాను తప్పించి ఆయన స్థానంలో సీనియర్ ఐపీఎస్ అధికారి ఆర్టీసీ ఎండీ.. ద్వారకా తిరుమలరావుకు ఇటీవలే పోస్టింగ్ ఇచ్చారు. ఏడీజీ ర్యాంకులో ఉన్న ముగ్గురు అధికారులకు శుక్రవారం పోస్టింగ్స్ ఇచ్చిన ప్రభుత్వం ఐజీ, డీఐజీ, ఎస్పీల బదిలీలపై కసరత్తు చేస్తోంది. విశాఖపట్నం, కర్నూలు, అనంతపురం రేంజ్ డీఐజీలతోపాటు రవాణా శాఖ కమిషనర్, డ్రగ్స్ కంట్రోల్ డీజీ, ఏసీబీ డైరెక్టర్ లాంటి పోస్టుల భర్తీ శనివారం పూర్తి అయ్యే అవకాశం ఉన్నట్లు సమాచారం. ఆదివారం నాటికి పలు జిల్లాల ఎస్పీల బదిలీ, పోస్టింగ్స్ ఉంటాయని ప్రభుత్వ వర్గాలు తెలిపాయి.

## నలుగురు ఐఏఎస్‌ల పదవీ విరమణ

**» పోస్టింగ్ ఇచ్చిన మర్నాడే మాజీ సీఎస్ జవహర్, పూనం రిటైర్**

అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): నలుగురు సీనియర్ ఐఏఎస్ అధికారులు శుక్రవారం పదవీ విరమణ చేశారు. మాజీ సీఎస్ కేఎస్ జవహర్ రెడ్డితో పాటు పూనం మాలకొండయ్య, కె.వెంకటరమణారెడ్డి, హెచ్.అరుణ్‌కుమార్ రిటైరయ్యారు. ఈ నెల 30వ తేదీతో వారికి 60 ఏళ్లు పూర్తవుతాయి. 29, 30 తేదీలు శని, ఆదివారాలు సెలవు రోజులు కావడంతో రెండ్రోజుల ముందే వారు పదవీ విరమణ చేశారు. సీఎస్ నీరబ్ కుమార్ ప్రసాద్ ఈ మేరకు ఉత్తర్వులు జారీ చేశారు. కాగా పదవీ విరమణ నేపథ్యంలో జవహర్ రెడ్డి, పూనంకు ప్రభుత్వం గురువారం పోస్టింగ్‌లు ఇచ్చింది. ఈడబ్ల్యూఎస్ వెల్ఫేర్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా పోస్టింగ్ తీసుకున్న జవహర్‌రెడ్డి రిటైర్ కావడంతో ఇన్‌చార్జిగా ప్రత్యేక ప్రధాన కార్యదర్శి అనంతరాముకు అదనపు బాధ్యతలు అప్పగించారు. జీఏడీ ప్రత్యేక ప్రధాన కార్యదర్శిగా ఉన్న పూనం మాలకొండయ్య స్థానంలో పోలా భాస్కర్‌కు అదనపు బాధ్యతలు అప్పగించారు. సివిల్ సప్లయ్స్ కమిషనర్‌గా ఉన్న హెచ్.అరుణ్‌కుమార్‌ను ప్రభుత్వం రిలీవ్ చేసింది. ఆయన స్థానంలో ఎవరినీ నియమించలేదు.

## పీఏసీఎస్‌లకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిలు

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలోని ప్రాథమిక వ్యవసాయ సహకార సంఘా(పీఏసీఎస్)లకు అధికారిక పర్సన్ ఇన్‌చార్జిలను నియమించాలని ప్రభుత్వం సహకారశాఖను ఆదేశించింది. అధికారిక పర్సన్ ఇన్ చార్జిలను నియమించే అధికారం జిల్లా సహకార శాఖ అధికారులకు అప్పగిస్తూ తాజాగా ఉత్తర్వులు జారీ చేసింది.

### మత్స్యకార సమాఖ్య పర్సన్ ఇన్‌చార్జిగా కమిషనర్

ఏపీ మత్స్యకార సహకార సంఘాల సమాఖ్య అధికారిక పర్సన్ ఇన్‌చార్జిగా మత్స్యశాఖ కమిషనర్‌ను ప్రభుత్వం నియమించింది. మత్స్యకార సమాఖ్యకు ప్రత్యక్ష ఎన్నికలు జరిగే వరకు లేదా ఈ ఏడాది డిసెంబరు 2వరకు పర్సన్ ఇన్‌చార్జిగా కమిషనర్ వ్యవహరించనున్నారు.

### ఆక్వా అథారిటీ వైస్ చైర్మన్ రాజీనామా ఆమోదం

ఏపీ స్టేట్ ఆక్వాకల్చర్ అథారిటీ కో వైస్ చైర్మన్ పదవికి వడ్డి రఘురామ్ రాజీనామా చేశారు. దానిని ఆమోదిస్తూ గెజిట్ ఉత్తర్వులు జారీ అయ్యాయి.

## ఎన్నికల విధుల్లో పాల్గొన్న ఉద్యోగులకు నెల జీతం: ఈసీ

అమరావతి, జూన్ 28(ఆంధ్రజ్యోతి): రాష్ట్రంలో 2024 సార్వత్రిక ఎన్నికల విధులు నిర్వహించిన అధికారులు, ఉద్యోగులకు ఒక నెల జీతాన్ని గౌరవ వేతనంగా ఇవ్వాలని ఈసీ ఆదేశించింది. ఈ మేరకు రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా ఉత్తర్వులు జారీ చేశారు. ఒక నెల స్థూల జీతానికి(గ్రాస్ శాలరీ) సమానంగా గౌరవ వేతనం చెల్లించాలని ఆదేశాలు ఇచ్చారు.

# కోట్లు కుమ్మేశారు!

**» టీచర్ల బదిలీల్లో మరిన్ని అక్రమాలు**

**» బొత్స, అధికారులు, సంఘాల నేతలు వాటాలు వేసుకుని మరీ దోపిడీ**

**» మొత్తం వసూళ్లు రూ.వంద కోట్ల పైనే**

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

బదిలీలు జరిగినప్పుడు ముడుపులు చేతులు మారడం చూస్తాం. కానీ, అసలు లేని బదిలీలను మధ్యలో సృష్టించి మరీ కోట్లు కుమ్మేయడం ఎక్కడైనా చూశారా?. కానీ, జగన్ ఏలుబడిలో ఏదైనా సాధ్యమేనని అప్పటి మంత్రి బొత్స సత్యనారాయణ నిరూపించారు. సాధారణ టీచర్లకు బదిలీల ఎరచూపి రూ.లక్షల్లో లంచాలు పిండుకుని రూ.కోట్లు కుమ్మేశారు!!

జగన్ జమానాలో వ్యవస్థలను భ్రష్టు పట్టించారు. చివరకు బదిలీల ప్రక్రియను కూడా ఆభాసుపాల్జేశారు. అప్పటి ముఖ్యమంత్రి కార్యాలయం కేంద్రంగా ఉపాధ్యాయుల బదిలీ అక్రమాలకు నాంది పలికితే అప్పటి విద్యాశాఖ మంత్రి బొత్స సత్యనారాయణ దానిని పతాక స్థాయికి తీసుకెళ్లారు. పాఠశాల విద్యాశాఖ అధికారులు, కొన్ని ఉపాధ్యాయ సంఘాల నేతలు కూడా వీలైనంత మేర దోచేశారు. మొత్తంగా రూ.100 కోట్లకు పైగా టీచర్ల బదిలీల కుంభకోణం జరిగినట్టు తెలుస్తోంది. అంతకముందు ప్రభుత్వాల్లోనూ అడపాదడపా సిఫారసులతో బదిలీలు చేసినా అవి చాలా పరిమిత సంఖ్యలో ఉండేవి. కానీ, జగన్ జమానాలో ఏకంగా 2,400 మంది టీచర్లను అక్రమంగా బదిలీ చేసినట్లు తాజాగా వెలుగులోకి వచ్చింది. మొత్తంగా ఏడాది కాలం వ్యవధిలో ఒకసారి 1,000 మందిని, మరోసారి 1,400 మందిని వైసీపీ ప్రభుత్వం అక్రమంగా బదిలీ చేసింది. అయితే మొన్నటివరకూ ఈ సంఖ్య 1,200 మాత్రమేనని అధికారులు ప్రచారం చేశారు. కానీ 2,400 మంది టీచర్లను దొడ్డిదారిలో బదిలీ చేసిన విషయం ప్రభుత్వం మారాక వెలుగు చూసింది. ఒక్కో బదిలీకి రూ.4 లక్షల నుంచి రూ.5 లక్షల వరకు వసూలు చేశారని సమాచారం.

### జగన్ ఆఫీస్ నుంచి మొదలు

అప్పటి సీఎం జగన్ కార్యాలయం(సీఎంవో) నుంచే బదిలీల తతంగం ప్రారంభమైనట్టు తెలిసింది. బదిలీల పేరిట తొలుత 350 మంది టీచర్లను అడ్డదారిలో కోరుకున్న స్థానానికి పంపించేందుకు పాఠశాల విద్యాశాఖ ప్రయత్నించింది. ఇది బయటికి రావడంతో వాటిని ఆపేశారు. ఆ తర్వాత 2022 చివర్లో మొదలు పెట్టి తరచూ జాబితాలు తయారుచేశారు. మొదట ఈ బదిలీలను అడ్డుకుంటున్నట్లు అప్పటి మంత్రి బొత్స కార్యాలయం ప్రచారం చేసింది. ఆ తర్వాత బదిలీలు చేసిపెట్టండి అంటూ ఆ జాబితాలో ఉన్న టీచర్లు ఆయన్నే ఆశ్రయించారు. ఇక అప్పటి నుంచీ అడ్డూ అదుపూ లేకుండా లంచాలు తీసుకుని ఇష్టానుసారం బదిలీలు చేశారు. 350 మందితో మొదలైన జాబితా 2400కు చేరింది. ఎన్నికల ముందు ఎంత వస్తే అంత అన్నట్టుగా అడిగిన వారందరికీ బదిలీ ఆర్డర్లు ఇచ్చేశారు. మొదట బదిలీ అయిన టీచర్లు కొత్త స్థానాల్లో చేరారు. కానీ, ఎన్నికలకు ముందు బదిలీ అయిన టీచర్లు ఆర్డర్లు పొందినప్పటికీ రిలీవ్ కాలేదు. ఇప్పుడు వారిని రిలీవ్ చేయొద్దని పాఠశాల విద్యాశాఖ ఆదేశించింది. బొత్స కార్యాలయంలో పనిచేసిన కమలాకర్ అనే వ్యక్తి ద్వారా ఈ అక్రమ బదిలీల వ్యవహారం సాగినట్టు తెలిసింది. ఎవరైనా సరే ఆయన్ను కలిసి ముడుపులు సమర్పించిన తర్వాతే బదిలీ ఆర్డర్లు బయటికొచ్చాయి. ఈ క్రమంలో పాఠశాల విద్య కమిషనరేట్, సచివాలయంలోని విద్యాశాఖ అధికారులు జోక్యం చేసుకున్నారు. వేల సంఖ్యలో చేపట్టిన బదిలీల్లో తమ వాటా అంటూ దాదాపు 30కి పైగా బదిలీలు వారు చేసి జేబులు నింపుకొన్నారు. మరోవైపు ఉపాధ్యాయ సంఘాల నేతలు సైతం ఈ వ్యవహారంలో తలదూర్చి బదిలీలు చేయించుకుని, ముడుపులు వసూలు దండుకున్నట్టు సమాచారం.

### ప్రవీణ్ సహకారం... సురేశ్ మౌనం

టీచర్ల బదిలీల అక్రమాలకు అప్పటి పాఠశాల విద్యాశాఖ ముఖ్య కార్యదర్శి ప్రవీణ్ ప్రకాశ్ పూర్తి సహకారం అందించారు. మంత్రి చెప్పారనే కారణంతో ఈ బదిలీలు చేయించి స్వామి భక్తి చాటుకున్నారు. అక్రమాలను అడ్డుకోవాల్సిన ఆయనే సచివాలయంలో అధికారులను కూర్చోబెట్టి మరీ ఆర్డర్లు ఇప్పించారు. ఇక పాఠశాల విద్యాశాఖ కమిషనర్ సురేశ్ కుమార్ కళ్ల ముందే అక్రమాలు జరుగుతున్నా తనకేం పట్టదన్నట్టు మౌనంగా ఉండిపోయారు. బదిలీ ఆర్డర్ పొంది రిలీవ్ కాని టీచర్ల పరిస్థితి దయనీయంగా మారింది. అధికారులు, ఉపాధ్యాయ సంఘాల నేతల మాటలు విని అడిగినంత ముడుపులు సమర్పించుకున్నారు. తీరా బదిలీ ఆదేశాలు పొందినా కొత్త స్థానానికి వెళ్లేలోగా ప్రభుత్వం మారడంతో ఆ బదిలీలు మధ్యలోనే ఆగిపోయాయి. దీంతో అటు డబ్బులు పోయి, ఇటు బదిలీ అవ్వక ఎటూ కాకుండా మిగిలిపోయారు.

### ఇకపై రాజకీయ జోక్యం ఉండదు!

గత ప్రభుత్వంలో జరిగిన అక్రమ బదిలీల వ్యవహారం పెను వివాదానికి దారితీయడంతో ఇకపై జరిగే బదిలీల్లో రాజకీయ జోక్యం అనే మాట వినిపించకూడదని తాజాగా జరిగిన విద్యాశాఖ సమీక్షలో మంత్రి నారా లోకేశ్ స్పష్టంచేశారు. పూర్తి పారదర్శకంగా బదిలీలు చేపట్టాలని ఆదేశించారు. అయితే గతంలో జరిగిన అక్రమాలపై విచారణ చేయించాలనే డిమాండ్లు పెరుగుతున్నాయి. మొత్తం అక్రమాలను వెలికి తీసి, బాధ్యులపై చర్యలు తీసుకోవాలని కొందరు కోరుతున్నారు. కఠిన చర్యలు తీసుకుంటేనే భవిష్యత్తులో అక్రమాల జోలికి పోవాలంటే భయం ఏర్పడుతుందని, లేదంటే అధికారులు, సంఘాల నేతలు కూడా బదిలీలంటే కాసుల వర్షం అన్నట్టుగా భావిస్తూ జేబులు నింపుకొంటున్నారని ఉపాధ్యాయ వర్గాలు అభిప్రాయపడుతున్నాయి.

# పింఛన్లు రెడీ

**» జూలైలో ఒక్కో పెన్షనర్‌కు రూ.7 వేలు**

**» నిధులు సమీకరించే పనిలో సర్కార్**

**» ఇప్పటికే రూ.5 వేల కోట్లకు ఇండెంట్**

**» ప్రతినెలా 1వ తేదీనే పింఛన్లు: మంత్రి డోలా**

అమరావతి (ఆంధ్రజ్యోతి), పొన్నలూరు (కొండపి), జూన్ 28: పేదలకు ఇచ్చిన హామీ నెరవేర్చేందుకు టీడీపీ కూటమి సర్కార్ ప్రయత్నాలు ప్రారంభించింది. పలు పథకాలకు సంబంధించి వాస్తవ పరిస్థితులను అధికారులతో సమీక్షిస్తూనే... మరోవైపు వచ్చే నెల 1న ఇవ్వాల్సిన పెన్షన్లు, ఉద్యోగుల జీతాల కోసం నిధుల సమీకరణకు చర్యలు తీసుకుంటోంది. సామాజిక పెన్షన్ల కోసం గతంలో కంటే ఎక్కువ మొత్తంలో నిధులు సమీకరించుకోవాల్సి ఉంది. నెలకు రూ.1000 అదనంగా ఇవ్వడంతో పాటు ఏప్రిల్, మే, జూన్ నెలలకు సంబంధించిన బకాయి రూ.3 వేలు కలిపి మొత్తం రూ.7 వేల చొప్పున చెల్లించాలి. ఇప్పటికే ఆర్బీఐ వద్దకు అప్పునకు వెళ్లిన సర్కార్ రూ.5 వేల కోట్లకు ఇండెంట్ పెట్టింది. మంగళవారం వేలం ద్వారా ఈ నిధులు వస్తాయి. సామాజిక పెన్షన్లతో పాటు ప్రభుత్వ ఉద్యోగుల జీతాలు కూడా ఒకటో తేదీన చెల్లించి ఉద్యోగుల్లో సైతం భద్రతా భావం పెంచాలని ప్రభుత్వం యోచిస్తోంది. కాగా పింఛన్లను ప్రతినెలా 1వ తేదీనే లబ్ధిదారులందరికీ ఇళ్ల వద్దనే ఇచ్చి చూపిస్తామని రాష్ట్ర సాంఘిక సంక్షేమ, సచివాలయాల శాఖ మంత్రి డోలా శ్రీబాలవీరాంజనేయస్వామి తెలిపారు. ప్రకాశం జిల్లా పొన్నలూరులో శుక్రవారం టీడీపీ కార్యకర్తలు, నాయకులు, ప్రజలతో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడారు. పార్టీ నాయకులు కూడా పింఛన్ల పంపిణీ కార్యక్రమంలో పాలుపంచుకుని లబ్ధిదారులకు 1వ తేదీనే అందేలా చూడాలని కోరారు. ఎస్సీలకు ఉపాధి కల్పన కోసం త్వరలో పెద్దఎత్తున సబ్సిడీ రుణాలు ఇవ్వనున్నట్లు తెలిపారు. పొలాలున్న ఎస్సీ రైతులకు ఫార్మింగ్ మెకనైజేషన్ ద్వారా వివిధ యంత్ర పరికరాలు సబ్సిడీపై అందజేస్తామన్నారు.

## ఏపీకి రండి.. పెట్టుబడులు పెట్టండి..!

**» ఖాట్మండులో జాస్తి వీరాంజనేయులు ప్రదర్శనలు**



ఖాట్మండులో ప్రదర్శన నిర్వహిస్తున్న జాస్తి వీరాంజనేయులు

విజయవాడ, జూన్ 28: 'ఆంధ్రప్రదేశ్‌కు విచ్చేసి కాబోయే ప్రపంచస్థాయి నగరం అమరావతిని సందర్శించండి. ఇక్కడ పెట్టుబడులు పెట్టండి' అంటూ అఖిల భారత పంచాయతీ పరిషత్ (న్యూఢిల్లీ) జాతీయ ఉపాధ్యక్షుడు, అమరావతి అభివృద్ధి కమిటీ చైర్మన్ జాస్తి వీరాంజనేయులు.. నేపాల్ వేదికగా పెట్టుబడిదారులకు పిలుపునిచ్చారు. నేపాల్ రాజధాని ఖాట్మండులో పర్యటించిన ఆయన అమరావతిలో పెట్టుబడులకు ముందుకురావాలని కోరుతూ ఫెక్సీలు ప్రదర్శించారు. యూనెస్కో గుర్తించిన పశుపతినాథ్ దేవాలయం, గుహేశ్వర పార్వతీమాత దేవాలయం, బౌద్ధ స్థూపం, స్వయంభు, బౌద్ధ నీలకంఠ వంటి ప్రఖ్యాత ప్రదేశాలలో ప్రదర్శన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. అమరావతిని ప్రపంచంలోనే మేటి నగరంగా తీర్చిదిద్దేందుకు సీఎం చంద్రబాబు విస్తృత ప్రణాళికలు రచిస్తున్నారన్నారు.

# బందరు వైసీపీ కార్యాలయానికి నోటీసు

**» 2 ఎకరాల్లో ప్యాలెస్ తరహా నిర్మాణం**

**» అనుమతుల్లేకుండా అడ్డగోలుగా నిర్మాణం**

**» ప్రభుత్వం మారగానే ఉత్తుత్తి దరఖాస్తు**

**» అప్పటికే 90 శాతం భవన నిర్మాణం పూర్తి**

**» పేర్నినాని పేరిట నోటీసులు జారీ**



మచిలీపట్నంలో నిర్మించిన వైసీపీ కార్యాలయ భవనం

మచిలీపట్నం టౌన్, జూన్ 28 : కృష్ణాజిల్లా మచిలీపట్నంలో అనుమతులు లేకుండా నిర్మించిన వైసీపీ కార్యాలయ భవనానికి మునిసిపల్ అధికారులు నోటీసులు జారీచేశారు. జగన్ ఐదేళ్ల పాలనలో ప్యాలెస్‌ల తరహాగా కట్టిన వైసీపీ కార్యాలయాల్లో ఇదీ ఒకటి. కొత్త ప్రభుత్వం వచ్చేనాటికి దాదాపుగా నిర్మాణం పూర్తయింది. దీనిని కోట్లాది రూపాయల విలువగల రెండెకరాల భూమిలో నిర్మించారు. అధికారం అండతో అప్పట్లో నిబంధనలకు విరుద్ధంగా ఎటువంటి ముందస్తు అనుమతులు లేకుండా కార్యాలయ భవనం నిర్మించారు. అక్రమమని తెలిసినా అధికారులు ఆనాడు ఏమీ చేయలేకపోయారు. నిబంధనల ప్రకారం, 1000 చదరపు గజాల విస్తీర్ణం దాటిన నిర్మాణాలకు 'ముడా' (మచిలీపట్నం అర్బన్ డెవలప్‌మెంట్ అథారిటీ) అనుమతులు తీసుకోవాలి. అయినా.. అడ్డగోలుగా నిర్మించేశారు. ఎన్నికల ఫలితాలు వెలువడి...టీడీపీ కూటమి ప్రభుత్వం వచ్చాకే ఆ పార్టీ నేతలు దరఖాస్తు చేశారు. అప్పటికి 90 శాతం నిర్మాణం పూర్తయిపోయింది. అయితే, వైసీపీ నేతలు ఇచ్చిన దరఖాస్తులో అవకతవకలు ఉన్నట్టు 'ముడా' అధికారులు గుర్తించారు. దాంతో నోటీసులు జారీ చేయాలని నిర్ణయించారు. మునిసిపల్ కమిషనర్ బాపిరాజు, మాజీ మంత్రి, కృష్ణా జిల్లా వైసీపీ అధ్యక్షుడు పేర్ని నానికి నోటీసులు జారీ చేసేందుకు వెళ్లారు. నాని కార్యాలయం వద్ద లేకపోవడంతో అక్కడ ఉన్న సిబ్బందికి గురువారం సాయంత్రం నోటీసులు అందజేశారు. "మచిలీపట్నం వైసీపీ కార్యాలయ భవనం 1000 చదరపు గజాలకు మించి ఉంది. అందువల్ల 'ముడా' అధికారుల అనుమతి తప్పనిసరి. దీంతో ఆ పార్టీ జిల్లా అధ్యక్షుడికి నోటీసులు జారీ చేశాం. వారిచ్చే సమాధానాన్ని అనుసరించి చట్ట ప్రకారం చర్యలు తీసుకుంటాం" అని మచిలీపట్నం కమిషనర్ బాపిరాజు తెలిపారు.




చిక్కీ వెనుక భాగంలో జగనన్న గోరుముద్ద వెబ్‌సైట్ పేరు ఉన్న దృశ్యం

## ఇంకా 'జగనన్న గోరుముద్దే'నా?

**» చిక్కీ ప్యాకెట్లపై జగన్ నామ స్మరణపై విమర్శలు**

పిఠాపురం, జూన్ 28: వైసీపీ పాలనలో సీఎం జగన్మోహన్‌రెడ్డి ఫొటోల పిచ్చి పతాక స్థాయికి చేరిన విషయం తెలిసిందే. ఇందులో భాగంగా పాఠశాలల్లో విద్యార్థులకు అందించే చిక్కీ ప్యాకెట్లపైనా జగన్ ఫొటోలు ముద్రించేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే జగన్ ఫొటోల స్థానంలో రాజముద్ర ముద్రించాలని, జగనన్న, వైఎస్ఆర్ పేర్లు తొలగించాలని స్పష్టమైన ఆదేశాలు జారీ అయ్యాయి. కాకినాడ జిల్లాలో విద్యార్థులకు సరఫరా చేసేందుకు వచ్చిన వేరుశెనగ చిక్కీలపై ఇంకా జగనన్న గోరుముద్ద అంటూ ముద్రించడంపై సర్వత్రా ఆగ్రహం, విమర్శలు వ్యక్తమవుతున్నాయి. ఈనెల 20న తయారైనట్లు ఉన్న ఈ చిక్కీల ప్యాకెట్ల ముందు భాగంలో జగన్ ఫొటోల స్థానంలో రాజముద్ర ముద్రించారు. ఇంతవరకు బాగానే ఉన్నా, వెనుకభాగంలో మాత్రం వెబ్‌సైట్‌ను 'జగనన్నగోరుముద్ద' పేరుతో ప్రింటింగ్ చేశారు. వాస్తవానికి కూటమి ప్రభుత్వం అధికారంలోకి రాగానే 15వ తేదీనే దీన్ని 'పీఎంపోషణ్'గా మార్పు చేశారు. కానీ అధికారులు మాత్రం ఇంకా 'జగనన్నగోరుముద్ద'గానే ఉంచారు. రాష్ట్రవ్యాప్తంగా చిక్కీల ప్యాకెట్లపై ఇదే విధంగా ఉన్నట్లు ఉపాధ్యాయులు చెబుతున్నారు. ప్రభుత్వం మారినా అధికారుల తీరులో మార్పులేదని విద్యార్థుల తల్లిదండ్రులు మండిపడ్డారు.

## దొరికిన దొంగలను వదిలేసి..

**» చోరీ సొత్తు అప్పగింతలో చేతివాటం.. చీమకుర్తి సీఐపై సస్పెన్షన్ వేటు**

ఒంగోలు (క్రైం), జూన్ 28: దొంగల విషయంలో ఉదాసీనంగా వ్యవహరించడమే కాకుండా దొరికిన సొత్తును అప్పగించడంలో చేతివాటం ప్రదర్శించిన ప్రకాశం జిల్లా చీమకుర్తి సీఐ దుర్గాప్రసాద్‌పై సస్పెన్షన్ వేటు పడింది. ఈ మేరకు గుంటూరు రేంజి ఐజీ సర్వశ్రేష్ఠ త్రిపాఠి శుక్రవారం ఉత్తర్వులు జారీచేశారు. ఇటీవల చీమకుర్తిలోని తహసీల్దార్ కార్యాలయం వద్ద ఓ ఇంట్లో దొంగతనానికి పాల్పడిన వేణుగోపాల్‌రెడ్డి, రఫీలను స్థానిక పోలీసులు పట్టుకున్నారు. అయితే వారికి స్టేషన్ బెయిల్ ఇచ్చి పంపడంతో తిరిగి ఈ నెల 4, 5 తేదీల్లో దొంగతనాలకు పాల్పడ్డారు. అంతేకాకుండా తహసీల్దార్ కార్యాలయం వద్ద జరిగిన దొంగతనం కేసులో 80 సవర్ల బంగారం పోయింది. కానీ, 40 సవర్లు మాత్రమే పోయినట్లు కేసు నమోదు చేశారు. అదేసమయంలో నిందితుల వద్ద 80 సవర్ల బంగారం దొరికింది. దీంతో బాధితులకు మొత్తం వెనక్కి ఇచ్చేందుకు సీఐ దుర్గాప్రసాద్ భారీగా అవినీతికి పాల్పడినట్లు ఆరోపణలు వచ్చాయి. జూన్ 4న చీమకుర్తిలో ఓ ఇంటి తలుపులు పగులకొట్టి దొంగతనం చేసేందుకు యత్నించిన వ్యక్తులను కూడా సీఐ వదిలేశారు. దీంతో వారు ఆ మరుసటి రోజే అద్దంకిలో మూడు ఇళ్లలో దొంగతనం చేశారు. అక్కడి నుంచి తిరిగొస్తూ ఈ నెల 6న చీమకుర్తిలో ఓ వ్యక్తిని కారుతో ఢీకొట్టారు. ఆ కారులో దొంగతనానికి అవసరమైన సామగ్రి దొరికింది. ఇలా వారు వరుస నేరాలకు పాల్పడుతున్నా పట్టించుకోలేదు. దీంతో చీమకుర్తి పోలీసుల తీరుపై ఉన్నతాధికారులు ఆరా తీశారు. సీఐ దుర్గాప్రసాద్ నిందితుల పట్ల ఉదాసీనంగా వ్యవహరించినట్లు నిర్ధారించి ఆయనను సస్పెండ్ చేశారు.

## ప్రతిభకు చిరునామా పీవీ: ప్రధాని మోదీ

న్యూఢిల్లీ, జూన్ 28(ఆంధ్రజ్యోతి): మాజీ ప్రధాని పీవీ నరసింహారావు నాయకత్వం, ప్రతిభకు చిరునామాగా నిలిచిపోతారని ప్రధాని మోదీ అన్నారు. శుక్రవారం పీవీ జయంతి సందర్భంగా ఆయన చిత్రపటానికి ప్రధాని మోదీ నివాళి అర్పించారు. దేశానికి పీవీ చేసిన సేవలను గుర్తించి ఈ ఏడాది ప్రారంభంలో ఆయనకు భారతరత్న ఇవ్వడం తమ ప్రభుత్వానికి దక్కిన గౌరవంగా భావిస్తున్నామని మోదీ ఎక్స్(ట్విటర్) వేదికగా పేర్కొన్నారు. మరోవైపు యూపీఏ ప్రభుత్వ హయాంలో కొనసాగిన వృద్ధిపై పీవీ ఆర్థిక సంస్కరణలు ప్రభావాన్ని చూపాయని కాంగ్రెస్ పేర్కొంది. పీవీ ఆర్థిక సరళీకరణ విధానాలు దేశంలో నవ శకానికి నాంది పలికాయని కాంగ్రెస్ అధ్యక్షుడు మల్లికార్జున ఖర్గే అన్నారు. దేశపురోగతిలో పీవీ పోషించిన కీలకపాత్ర ఎప్పటికీ గుర్తుండిపోతుందని ఆయన ఎక్స్‌లో పేర్కొన్నారు. పీవీ ప్రభుత్వ హయాంలో దేశం అణు రంగంలో గణనీయమైన వృద్ధిని సాధించిందని, లుక్ ఈస్ట్ వంటి వినూత్న విదేశాంగ విధానాలు రూపొందాయని ఖర్గే తెలిపారు.

# ప్రభుత్వమేదైనా.. ఆయనది ఇష్టారాజ్యం!

**» అవినీతి అధికారికి మళ్లీ అందలం**

**» వైసీపీ చలువతో 10 లక్షల జీతం అందుకున్న వైనం**

**» ఆగస్టులో రిటైర్...ఇంకో రెండేళ్లు కొనసాగింపు యత్నాలు ముమ్మరం**

**» మంత్రి నారాయణతో సిఫారసు చేయించుకున్నారని ప్రచారం**

(అమరావతి-ఆంధ్రజ్యోతి)

'నేను తెలుగు బాష లెక్క.. అడా ఉంటా... ఈడా ఉంటా'.... ఆ మధ్య ఫేమస్ అయిన డైలాగ్ ఇది. ఈ కోవలోనే జగన్ సర్కారైనా... చంద్రబాబు ప్రభుత్వమైనా నాకు ఢోకా లేదంటున్నారు ఓ ప్రభుత్వ (ప్రైవేట్) అధికారి. రాష్ట్రంలో అత్యున్నత అధికారి సీఎస్‌కు మించి జీతాన్ని అందుకుంటున్న ఈయన జగన్ జమానాలో ఆడింది ఆట... పాడింది పాటగా హవా సాగించారు. ప్రభుత్వ రంగంలోని ఓ సంస్థలో ఉద్యోగిగా చేరిన ఈ 'ప్రైవేట్' వ్యక్తి అప్పట్లో నేతలు, ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకున్నారు. ఇప్పుడు కొత్తగా ఏర్పడిన చంద్రబాబు సర్కారులోనూ తన కొలువును పదిలం చేసుకునే పని మొదలెట్టారు. పురపాలక మంత్రిగా బాధ్యతలు చేపట్టిన నారాయణ వద్ద తన పరపతిని చూపించుకుని మరో రెండేళ్లు కొలువును పొడిగించుకునే ప్రక్రియను శరవేగంగా ముందుకు తీసుకుపోతున్నారని సమాచారం. ఇందుకోసం రాయలసీమకు చెందిన మరో ఇద్దరు మంత్రుల నుంచి సిఫారసు లేఖలు తెచ్చుకున్నారని చెబుతున్నారు.

ప్రైవేటు ఉద్యోగిగా ఉన్న ఒక వ్యక్తి ప్రభుత్వ రంగ సంస్థలో ఉద్యోగిగా చేరి అలవెన్సులతో కలిపి ప్రతి నెలా రూ.10 లక్షల జీతం తీసుకుంటున్నారు. ఈ ఏడాది ఆగస్టులో రిటైర్ కాబోతున్న ఈ ప్రైవేట్ అధికారి మరో రెండేళ్లు కొనసాగేందుకు తన లాబీయింగ్ ముమ్మరం చేశారు. వైసీపీ నేతలకు బంధువైన ఈ అధికారి జగన్ సర్కారులో అందినకాడికి దోచుకున్నారు. టీడీపీ ప్రభుత్వం వచ్చాక పక్కకు తప్పిస్తారని భావించినా, అందుకు విరుద్ధంగా మరో రెండేళ్లు కొనసాగించేందుకు ఫైల్ నడుస్తుండటంతో ఆ శాఖ సిబ్బంది అవాక్కయ్యారు. జగన్ హయాంలో ప్రభుత్వ రంగంలోని ప్రాజెక్టులను ప్రైవేట్ కంపెనీలకు కట్టబెట్టడంలో సదరు అధికారి చాతుర్యానికి ఉన్నతాధికారులు ఫిదా అయ్యారు. ఉన్నతాధికారులను ప్రసన్నం చేసుకోవడం, వారికి వాటాలివ్వడం, ఇష్టారాజ్యంగా దోపిడీకి తెరలేపడం ఆ ప్రైవేట్ అధికారికి నిత్యకృత్యం. అర్హత, అనుభవం లేకపోయినా ఉన్నతాధికారుల చలువతో ఉన్నపళంగా ఓ విభాగానికి హెడ్‌గా ఉన్న ఆ అధికారి ఏకంగా ఆ సంస్థకు సీఈవో అయ్యారు. తన జీతాన్ని 400 శాతం పెంచుకున్నారు. సీఎస్, డీజీపీకి కూడా లేని స్థాయిలో గెస్ట్ హౌస్‌లో ప్రభుత్వ వ్యయంతో నివాసం ఉంటున్నారంటే ఆ అధికారి జబర్దస్త్ అర్థం చేసుకోవచ్చు. ఆ అధికారి అవినీతిపై తీవ్ర ఆరోపణలు వచ్చిన నేపథ్యంలో ప్రభుత్వం ఓ విచారణాధికారిని నియమించి విచారించినా.. నివేదిక వెలుగులోకి రాకుండా ఆయన తన పరపతిని ఉపయోగించుకున్నారు. ప్రభుత్వ విభాగాలకు డిజైన్లు, ప్రాజెక్టు వర్క్ తదితర సేవలందించే ఏపీ పట్టణ మౌలిక వసతుల, ఆస్తుల నిర్వహణ సంస్థ(ఏపీయూఐఏఎంఎల్)ను సూట్‌కేస్ కంపెనీగా మార్చేశారన్న ఆరోపణలు వెల్లువెత్తుతున్నాయి. హైదరాబాద్‌లోని ఓ ప్రైవేట్ కంపెనీలో పనిచేస్తున్న ఈయన ఏపీయూఐఏఎంఎల్‌లో ఓ విభాగానికి హెడ్‌గా విధుల్లో చేరారు. ఆ తర్వాత ఆయన ఆ సంస్థకే సీఈఓగా ఎదిగారు.

### పారదర్శకత లేని నియామకాలు

సీఈఓగా ఈ అధికారి చేపట్టిన నియామకాలూ అడ్డగోలుగా ఉన్నాయన్న ఆరోపణలున్నాయి. వాస్తవానికి ఏపీ పట్టణ మౌలిక వసతుల, ఆస్తుల నిర్వహణ సంస్థకు ప్రైవేట్ ఉద్యోగుల నియామకం చేసుకునే అధికారం లేదు. అయితే పై నుంచి కింది దాకా తన హవా నడుస్తుండటంతో పలు శాఖలకు సంబంధించిన ఉద్యోగులను ఈ సంస్థే నియమిస్తోంది. ఈ క్రమంలోనే ఇటీవల ఎన్నికల కమిషన్‌కు కూడా కొంత మంది ఉద్యోగులను నియమించింది. ఎన్నికల కమిషన్, ఏపీ ఫుడ్ ప్రాసెస్ సొసైటీ, జైళ్ల శాఖ, స్వచ్ఛాంధ్ర కార్పొరేషన్, జీవీఎంసీలో స్మార్ట్‌సిటీ తదితర ప్రాజెక్టులకు ఈ సంస్థ డీపీఆర్‌తో పాటు కన్సల్టెంట్ సేవలను అందిస్తోంది. ప్రభుత్వంలో ఔట్‌సోర్సింగ్ కార్పొరేషన్ ఉన్నా దానితో సంబంధం లేకుండానే ఆయా శాఖలు ఈ సంస్థ ద్వారా నియామకాలు చేపడుతున్నాయంటే దాని వెనుక మతలబు ఇట్టే అర్థమవుతోంది.

### ట్రైబల్ స్పోర్ట్స్ మీట్ టెండర్ గోల్‌మాల్

ప్రభుత్వ శాఖలకు సంబంధించిన టెండర్ల ప్రక్రియ ఈ సంస్థ ద్వారా నిర్వహిస్తారు. ఏకలవ్య మోడల్ గురుకుల పాఠశాల సంస్థ ఆధ్వర్యంలో జాతీయ క్రీడలను నిర్వహించారు. ఇందుకోసం కేంద్ర ప్రభుత్వం సుమారు రూ.25 కోట్లు కేటాయించింది. క్రీడల నిర్వహణకు ఈ సంస్థ టెండర్లు నిర్వహించింది. అర్హత కలిగిన సంస్థలను టెండర్లలో పాల్గొనకుండా నిబంధనలు మార్చేసి తనకు కావాల్సిన సంస్థకు టెండర్లు కట్టబెట్టారు. దీంతో ఈ క్రీడల్లో సౌకర్యాలు కల్పించలేక రాష్ట్రప్రభుత్వం జాతీయస్థాయిలో అభాసుపాలైంది.

## మూతబడ్డ ఆప్కో దుకాణాలను పునఃప్రారంభిస్తాం


**» వారంలో ఓ రోజు నేత వస్త్రాలు ధరించాలి: మంత్రి సవిత**



పెనుకొండ టౌన్, జూన్ 28: 'రాష్ట్ర వ్యాప్తంగా మూతబడిన ఆప్కో షోరూమ్‌లను పునఃప్రారంభించి, మరింత అభివృద్ధిపరుస్తాం. చేనేతలను ప్రోత్సహించేందుకు ప్రతి ఒక్కరూ వారంలో ఒక రోజు చేనేత వస్త్రాలు ధరించాలి' అని చేనేత, జౌళి శాఖ మంత్రి సవిత పిలుపునిచ్చారు. శ్రీసత్యసాయి జిల్లా పెనుకొండ నగర పంచాయతీ అత్యవసర కౌన్సిల్ సమావేశంలో శుక్రవారం ఆమె ఎక్స్ అఫీషియో మెంబర్ హోదాలో తొలిసారి పాల్గొన్నారు. సమీపంలోని బాలికల పాఠశాల, జూనియర్ కళాశాలను తనిఖీ చేశారు. అనంతరం విలేకరులతో మాట్లాడుతూ, 'వైసీపీ పాలనలో ఆప్కో హ్యాండ్లూమ్స్ పరిస్థితి దయనీయంగా మారింది. చేనేత కార్మికులు గడిచిన ఐదేళ్లలో చాలా ఇబ్బందులు ఎదుర్కొన్నారు. కుటుంబ పోషణ భారమై పలువురు ఆత్మహత్య చేసుకున్నారు. చేనేత కార్మికులు బాగుంటేనే ఆప్కో బాగుంటుంది. రాష్ట్ర వ్యాప్తంగా ఆప్కో షోరూమ్‌ల ఏర్పాటుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. చేనేతను మరింత అభివృద్ధి చేసేందుకు, అంతర్జాతీయ మార్కెటింగ్‌కు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నాం. నేతన్నలకు గతంలోని సంక్షేమ పథకాలను కొనసాగించడంతోపాటు మరింత తోడ్పాటును అందిస్తాం' అని మంత్రి సవిత తెలిపారు.

## చంద్రబాబును కలిసిన తెలంగాణ గవర్నర్

**» కనకదుర్గమ్మ సేవలో సీపీ రాధాకృష్ణన్**



తెలంగాణ రాష్ట్రాల గవర్నర్ రాధాకృష్ణన్‌కు అమ్మవారి చిత్రపటం అందజేస్తున్న ఈవో రామారావు

అమరావతి(ఆంధ్రజ్యోతి), విజయవాడ, జూన్ 28: తెలంగాణ రాష్ట్ర గవర్నర్ రాధాకృష్ణన్ శుక్రవారం ఉదయం ఇక్కడ ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి చంద్రబాబును కలిశారు. తొలిగా ఆయన విజయవాడ కనకదుర్గమ్మ ఆలయాన్ని సందర్శించారు. ఆయనకు ఈవో కేఎస్ రామారావు, అధికారులు ఆలయ మర్యాదలతో సాదర స్వాగతం పలికారు. అమ్మవారి దర్శనానంతరం వేద పండితులు వేదాశీర్వచనం చేశారు. ఈవో, గవర్నర్‌కు అమ్మవారి ప్రసాదం, శేషవస్త్రం, చిత్రపటం అందజేశారు. అనంతరం ఆయన ఉండవల్లిలోని చంద్రబాబు నివాసానికి వచ్చారు. ఆయనకు చంద్రబాబు, ఆయన తనయుడు, రాష్ట్ర మంత్రి లోకేశ్ స్వాగతం పలికి నివాసంలోకి తీసుకువెళ్లారు. చంద్రబాబు ఆయనకు జ్ఞాపిక బహూకరించగా... లోకేశ్ మంగళగిరి చేనేత శాలువాను కప్పి సత్కరించారు. సుమారు రెండు గంటలపాటు ఆయన చంద్రబాబు నివాసంలో ఉన్నారు. అనంతరం హైదరాబాద్ తిరిగి వెళ్లిపోయారు. అసెంబ్లీ ఎన్నికల ముందు చంద్రబాబు ఒకటికి రెండుసార్లు తెలంగాణ గవర్నర్‌ను కలిశారు. సీఎంగా బాధ్యతలు స్వీకరించిన తర్వాత ఆయన ఆహ్వానంపై గవర్నర్ వచ్చారని, ఇది మర్యాదపూర్వక భేటీ అని టీడీపీ వర్గాలు తెలిపాయి.

# మచిలీపట్నం మాజీ మున్సిపల్ కమిషనర్‌కు జైలు

**» కోర్టు ధిక్కరణ కేసులో 6 నెలలు జైలు, 2 వేలు జరిమానా**

**» అప్పీల్ దాఖలుకు తీర్పు అమలు 4 వారాల నిలుపుదల**

అమరావతి, జూన్ 28 (ఆంధ్రజ్యోతి): మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ మాజీ కమిషనర్ జి.చంద్రయ్యకు కోర్టు ధిక్కరణ కేసులో జైలు శిక్ష పడింది. ఆయనకు ఆరు నెలల జైలు శిక్షతో పాటు రూ.2000 జరిమానాను హైకోర్టు విధించింది. అప్పీల్ చేసుకొనేందుకు సమయం ఇవ్వాలని చంద్రయ్య తరపు న్యాయవాది అభ్యర్థించడంతో తీర్పు అమలును నాలుగు వారాలు నిలుపుదల చేసింది. హైకోర్టు న్యాయమూర్తి జస్టిస్ నిమ్మగడ్డ వెంకటేశ్వర్లు శుక్రవారం ఈ మేరకు తీర్పు ఇచ్చారు. ప్రస్తుతం చంద్రయ్య ఏలూరు మున్సిపల్ కార్పొరేషన్‌లో అదనపు కమిషనర్‌గా బాధ్యతలు నిర్వర్తిస్తున్నారు. కృష్ణా జిల్లా మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్‌లో ఎస్.వెంకటేశ్ రెవెన్యూ ఆఫీసర్‌గా పనిచేశారు. వెంకటేశ్‌పై ఏసీబీ అధికారులు క్రిమినల్ కేసు పెట్టడంతో అధికారులు ఆయన్ను సస్పెండ్ చేశారు. చార్జిషీట్ దాఖలు ఆలస్యం కావడంతో తనను తిరిగి విధుల్లోకి తీసుకోవాలని వెంకటేశ్ ఉన్నతాధికారులకు దరఖాస్తు చేసుకున్నారు. దానిని పరిశీలించిన పురపాలక శాఖ డైరెక్టర్ వెంకటేశ్‌ను విధుల్లోకి చేర్చుకోవాలని 2022 అక్టోబరు 17న మచిలీపట్నం మున్సిపల్ కార్పొరేషన్ కమిషనర్‌ను ఆదేశించారు. పురపాలక శాఖ డైరెక్టర్ ఉత్తర్వులకు కమిషనర్ స్పందించకపోవడంతో వెంకటేశ్ హైకోర్టులో రిట్ పిటిషన్ దాఖలు చేశారు. ఈ వ్యాజ్యంపై విచారణ జరిపిన న్యాయస్థానం పురపాలక శాఖ డైరెక్టర్ ఇచ్చిన ఉత్తర్వులు, పిటిషనర్ వినతిని పరిగణనలోకి తీసుకొని తగిన ఉత్తర్వులు జారీ చేయాలని 2023 మే 12న తీర్పు ఇచ్చింది. ఈ ఉత్తర్వులు అమలు చేయకపోడంతో పిటిషనర్ కోర్టు ధిక్కరణ పిటిషన్ దాఖలు చేశారు. దీనిపై విచారణ జరిపిన న్యాయమూర్తి చంద్రయ్య తీరును తీవ్రంగా తప్పుపట్టారు. చంద్రయ్య వ్యవహారశైలి చట్టబద్ధమైన పాలనకు విఘాతమని పేర్కొన్నారు. కోర్టు ఉత్తర్వులలో తప్పులు వెతక్కుండా వాటిని అమలు చేయాల్సిన బాధ్యత అధికారులపై ఉందన్నారు. ఉత్తర్వులపై అభ్యంతరం ఉంటే అప్పీల్ దాఖలు చేసుకోవాలన్నారు. ప్రస్తుత కేసులో చంద్రయ్య ఉన్నతాధికారుల ఆదేశాల పట్ల అవిధేయత ప్రకటించడమే కాకుండా కోర్టు ఉత్తర్వుల అమలును ఉద్దేశపూర్వకంగా ఉల్లంఘించారని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో చంద్రయ్యకు జైలు శిక్ష, జరిమానా విధిస్తున్నట్లు ప్రకటించారు.